


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 348, పేజీలు - 08

సోమవారం, జూన్ 8, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# కిషన్ రెడ్డి సంగతి జూన్ 15 తర్వాత తేలుస్తా

- హైదరాబాద్ అభివృద్ధిని కేంద్ర మంత్రి అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
- మెట్రో, మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు పనులకు ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శ
- ఉప్పల్ నియోజకవర్గంలో రూ.1600 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టీకరణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఓ కేంద్రమంత్రి హైదరాబాద్ మెట్రో విస్తరణను ఢిల్లీలో అడ్డుకుంటున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బీజేపీలో ఉంటూనే బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు సహకరిస్తున్నారని స్వయంగా ఆ పార్టీ నేతలు చెబుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం నుండి అనుమతులు ఎందుకు రావడం లేదో సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఉప్పల్ భగాయత్ వేదికగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

### క్యూర్-1 మొబైల్ యాప్ ఆవిష్కరణ

ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు సాంకేతిక సేవలను ప్రారంభించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం, ఉప్పల్‌లో వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, ఏవోసీ (రూజ) సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన పునాది వేశారు. భవిష్యత్తు డిజిటల్ సేవల కోసం క్యూర్-1 మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ నూతన యాప్ ద్వారా నగర ప్రజలు తమ ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులను సులభంగా చెల్లించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్ పేరుతో అభివృద్ధి చేసుకుంటారు. యూపీలో గంగా నదిని అక్కడి ప్రభుత్వాలు ప్రక్షాళన చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ గొప్పగా చెబుతున్నారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కానీ, తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామంటే మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలోనే ఉండాలని, అభివృద్ధిలో కాదని హితవు పలికారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను సమర్థించే బీజేపీ నేతలు, మూసీ ప్రక్షాళనపై రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు.
జూన్ 15 తర్వాత తెలంగాణ ప్రభుత్వ కార్యాచరణ మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి

2లో..



## విజయ్ ప్రభుత్వం 3 నెలలైనా నిలబడుతుందా

- స్టాలిన్ తీవ్ర విమర్శలు



**చెన్నై (ప్రశ్న న్యూస్)** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం కొనసాగడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. విజయ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 నెలలు కూడా నిలవగలదా అనే చర్చ తమిళనాడు ప్రజల్లో ఇప్పటికే మొదలైందని వ్యాఖ్యానించారు. తన అనుచరులతో కలిసి పనియూర్ బాబు డీఎంకే పార్టీలో చేరిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఎంకే స్టాలిన్ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 6 నెలల పాటు విమర్శలు చేయకూడదని తమ పార్టీ నిర్ణయించుకున్నట్లు గుర్తుచేశారు. టీవీకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు తాము 6 నెలల పాటు ఎలాంటి విమర్శలు చేయబోమని చెప్పామని.. అయితే ఆ గడువు పూర్తికాకముందే రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయని స్టాలిన్ ఆరోపించారు. కానీ ఇప్పుడు తమిళనాడు ప్రజలు టీవీకే ప్రభుత్వం 6 నెలలు కాదు కనీసం 3 నెలలు అయినా కొనసాగుతుందా అని మాట్లాడుకుంటున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు

2లో..

## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం

### - ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీ రద్దు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** జనసేన పార్టీలో ప్రక్షాళన దిశగా అధినేత పవన్ కల్యాణ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా, నగర, మండల, గ్రామ స్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. నెల్లూరు జిల్లాలో నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు, క్రమశిక్షణారాహిత్యం పెరిగిపోయిందని పార్టీ అధిష్ఠానం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. నాయకులు పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరి వల్ల కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన సైనికులు, పార్టీ మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు అందాయని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. “క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేం. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది” అని పవన్ వివరించారు. కొద్ది రోజుల క్రితమే ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే తరహా చర్యను ఇప్పుడు నెల్లూరు జిల్లా విషయంలోనూ తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో జిల్లా సమన్వయ బాధ్యతలు చూస్తున్న వారితో సహా కమిటీల్లోని సభ్యులందరూ తమ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లయింది. కొత్త కమిటీని నియమించేంత వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తామని జనసేన స్పష్టం చేసింది.

## రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ గతే పడుతుంది

- సీఎం రేవంత్ రెడ్డిపె
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పట్టిన గతే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి కూడా పడుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అబద్ధపు హామీలు, అసమర్థ పాలనతో ప్రజాగ్రహానికి గురై ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారం మారినా ప్రజల ఆకాంక్షలు మాత్రం నెరవేరడం లేదని విమర్శించారు.

2లో..

## టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల

### - ఇదివరకే జనసేన అభ్యర్థి నామినేషన్



అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులుగా భాష్యం రామకృష్ణ, సానా సతీశ్, చింతకాయల విజయ్‌ల పేర్లను పార్టీ అధిష్ఠానం శనివారం నాడు ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ అధికారిక ప్రకటన కూడా విడుదల చేసింది. అభ్యర్థుల ఎంపికలో సోషల్ బ్యాలెన్స్, పార్టీ పట్ల అంకితభావం, యువతకు పెద్దపీట వేసేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ముగ్గురు అభ్యర్థులు నేడు తమ నామినేషన్లను దాఖలు చేయనున్నారు. రాష్ట్రం నుండి ఖాళీ అవుతున్న మొత్తం 4 రాజ్యసభ స్థానాలకు గాను, కూటమి ఒప్పందంలో భాగంగా తెలుగుదేశం పార్టీ 3 స్థానాలను, జనసేన పార్టీ ఒక స్థానాన్ని తీసుకున్నాయి. ఇందులో జనసేన కోటాకు సంబంధించిన స్థానంలో ఆ పార్టీ అభ్యర్థిగా లింగమనేని రమేష్ ఇప్పటికే తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన దాఖలు చేసిన నామినేషన్ పత్రాలపై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేసి ఇదివరకే తమ మద్దతును తెలిపారు.

### జనసేన రాజ్యసభ అభ్యర్థి లింగమనేని రమేష్ నామినేషన్

ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీ తన అభ్యర్థిగా ప్రముఖ వ్యాపారవేత్త లింగమనేని రమేష్‌ను బరిలోకి దింపింది. శనివారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ఆయన అధికారిక ‘బి-ఫామ్’ అందుకున్నారు. ఈ సందర్భంగా పెద్దల సభలో రాష్ట్ర ప్రయోజనాల కోసం లింగమనేని బలంగా గళం వినిపిస్తారని పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వెలగపూడిలోని శాసనసభ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వనితా రాణికి లింగమనేని రమేష్ తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బీజేపీ ఎమ్మెల్యే ఎన్. ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. లింగమనేని అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ నాదెండ్ల మనోహర్, బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్‌తో పాటు కూటమికి చెందిన

2లో..

## అప్పుల కుప్పగా సింగరేణి

### - మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** రెండున్నరేండ్లలోనే సింగరేణి సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు ఆగ్ర హం వ్యక్తంచేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ పట్టణంలో నిర్వహించిన సింగరేణి పరిరక్షణ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన బొగ్గు బకాయిలు భారీగా పెరిగిపోయి సంస్థ పూర్తిగా నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రెండున్నరేండ్లలోనే రూ.12,377 కోట్ల బొగ్గు బకాయిలు సింగరేణికి చెల్లించలేదని, ఇది తాను సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న సమాచారం పచ్చి నిజమని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి సింగరేణి సంస్థ బొగ్గు బకాయిలు రూ.7,355 కోట్లు ఉండగా, అందులో తెలంగాణ ఏర్పడక ముందు రూ.1,958 కోట్ల బకాయిలు ఉన్నాయని వివరించారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులుఅంటే పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో కేవలం రూ.5 వేల కోట్లలోపే బొగ్గు బకాయిలు ఉంటే,

2లో..

## రేవంత్ ‘హిట్లర్’ వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా
- మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ
- తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి
- బెంగళూరులో రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా పోస్ట్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు” అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. “మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ

2లో..

## చమురు మార్కెట్‌లో భారత్ విశ్వరూపం!

- రాబోయే దశాబ్దపు ప్రపంచ డిమాండ్‌లో సగభాగం మనదే.. రష్యా చమురు దిగ్గజం రోజ్‌నెఫ్ట్ అంచనా



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో భారత్ సరికొత్త శకాన్ని లిఖించబోతోంది. రాబోయే పదేళ్ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా పెరిగే ముడిచమురు డిమాండ్‌లో సింహభాగం భారత్ నుంచే ఉండబోతోందని అంతర్జాతీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో రానున్న దశాబ్దంలో అదనంగా పెరిగే చమురు అవసరాలలో సగం వాటా ఒక్క భారతదేశానిదేనని రష్యాకు చెందిన ప్రముఖ చమురు సంస్థ ‘రోజ్‌నెఫ్ట్’ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) ఇగోర్ సెచిన్ ప్రకటించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక సదస్సులో శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ చమురు రంగంలో భారత్ అత్యంత కీలకమైన, ప్రత్యేకమైన స్థానాన్ని సొంతం చేసుకుందని విశ్లేషించారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) అంచనాల

2లో..

ప్రజాప్రశ్న
హైదరాబాద్ సోమవారం 8, జూన్ 2026

# కిషన్ రెడ్డి సంగతి జూన్ 15 తర్వాత తేలుస్తా

వ్యాఖ్యానించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఇవ్వరో, మన రైతులు పండించిన ధాన్యాన్ని ఎందుకు పూర్తిగా కొనరో, రీజినల్ రింగ్ రోడ్డుకు (ఆర్ఆర్ఆర్) నిధులు ఎందుకు కేటాయించరో వాటి సంగతి చూస్తామన్నారు. మంచి పనుల విషయంలో రాజకీయం చేయవద్దని ప్రతిపక్షాలకు సూచించారు. నన్ను ఎవ్వరూ ఏం చేయలేరని కిషన్ రెడ్డి అంటున్నాడు. అయితే ఇక్కడి ప్రజలతో పెట్టుకున్నోడు, తెలంగాణ ప్రజలతో గోక్కున్నోడు చరిత్రలో బాగుపడి బట్టకట్టినోడు లేడన్నారు.

### మెట్రో విస్తరణను ఆపుతున్న కేంద్ర మంత్రి

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 1.34 కోట్ల మంది జనాభా ఉన్నారని, ఇంత భారీ సంఖ్యలో ఉన్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం సాధారణ విషయం కాదన్నారు. నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో రైలు ప్రతిపాదన చేశాం. 122 కి.మీ మేర మెట్రో విస్తరణకు అన్ని అనుమతులు వచ్చాక మన కేంద్రమంత్రి కాళ్ళల్లో కట్టెలు, పుల్లలు పెట్టి అర్ధాంతరంగా ఆపేశారని ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం కాలుకు బలపం కట్టుకొని తిరుగుతున్నప్పటికీ అనుమతులు రాకుండా ఎవరు ఆపుతున్నారు? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పరిపాలనా సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజిస్తే, కొందరు రాజకీయ లబ్ధి కోసమేనంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకే ఉప్పల్‌లో మున్సిపల్ ఆఫీసును ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా కష్టాల్లో ఉన్న సమయంలో తనను మల్కాజిగిరి ప్రజలే ఎంపీగా గెలిపించారని గుర్తు చేసుకున్నారు. గతంలో కేంద్రం సహకారం లేకపోవడం వల్లే అనుకున్న పనులు చేయలేకపోయానని, ఇప్పుడు ముఖ్యమంత్రిగా మల్కాజిగిరి నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేసే బాధ్యతను తానే తీసుకుంటున్నానని చెప్పారు.

# విజయ్ ప్రభుత్వం 3 నెలలైనా నిలబడుతుందా

చేపట్టిన తర్వాత టీవీకేపై స్టాలిన్ విమర్శలు చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం. గత నెలలో కూడా ఆయన టీవీకేను ఉద్దేశించి విమర్శలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం డీఎంకే సన్నాహాలు ప్రారంభించిందని గుర్తు చేసిన స్టాలిన్ బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం, ఒంగ్రినైవోమ్ వా సభ్యత్వ కార్యక్రమం, యువజన విభాగ ప్రాంతీయ సమావేశాలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌ల నియామకం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇంత చేసినా డీఎంకే తిరిగి అధికారంలోకి రాలేకపోయిందని పేర్కొన్నారు. కానీ టీవీకే ఓటర్లను కలవలేదని చాలా చోట్ల బూత్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లను కూడా నియమించలేదని అయినప్పటికీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేశారని విజయ్ విజయంపై స్టాలిన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే స్టాలిన్ నేరుగా టీవీకే పేరును ప్రస్తావించకుండా పరోక్షంగా వ్యాఖ్యానించడం గమనార్హం.ఈ సందర్భంగా డీఎంకేలో చేరిన పనియూర్ బాబును స్టాలిన్ అభినందించారు. గత 5 ఏళ్లుగా అసెంబ్లీలో ఆయన పనితీరును తాను దగ్గరగా గమనించానని తెలిపారు. పనియూర్ బాబు అసెంబ్లీకి నిశ్శబ్దంగా వచ్చి, నిశ్శబ్దంగా వెళ్లేవారని కానీ మాట్లాడిన ప్రతిసారి నిర్మాణాత్మక అంశాలను లేవనెత్తేవారని గుర్తు చేశారు. తన నియోజకవర్గ సమస్యలను బలంగా వినిపించేవారని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేలో చేరే ముందు పనియూర్ బాబు విడుదల చేసిన ప్రకటనను కూడా ఆయన ప్రశంసించారు. ఆ ప్రకటనను తాను చదివానని అందులో ఎవరి మనోభావాలు దెబ్బతినేలా ఒక్క మాట కూడా మాట్లాడలేదని వెల్లడించారు. పార్టీ మారడానికి గల కారణాలను పనియూర్ బాబు ఎంతో గౌరవప్రదంగా వివరించారని కొనియాడారు. పనియూర్ బాబు తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే అంకితభావం కలిగిన నాయకుడు అని స్టాలిన్ వెల్లడించారు. పనియూర్ బాబు విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) పార్టీకి ఇటీవలె రాజీనామా చేశారు. గతంలో చెయ్యూర్ నియోజకవర్గం నుంచి వీసీకే తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన పనియూర్ బాబు గత నెలలో వీసీకే ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేసిన తాజాగా స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరారు.

# రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ గతే పడుతుంది

అడ్డగోలు హామీలు, నమ్మకద్రోహంతో క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత దేశంలో జరుగుతున్న అభివృద్ధిపై విమర్శలు చేస్తూ, విదేశాలపై వ్యామోహం చూపించడం ఇద్దరు ముఖ్యమంత్రుల్లోనూ చూశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా విదేశీ భాషలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డికి కూడా కేసీఆర్ కు పట్టిన గతే పడుతుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. చేతగాని పాలన అందిస్తున్న నేతల గ్రాఫ్ పాతాళానికి పడిపోవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

# టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల

పలువురు ప్రముఖ నేతలు ప్రతిపాదన సంతకాలు చేశారు. పారిశ్రామికవేత్త అయిన లింగమనేని ఎంపిక రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.తనపై నమ్మకంతో రాజ్యసభ అవకాశం కల్పించిన పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన మోదీ, చంద్రబాబులకు ధన్యవాదాలు చెబుతూ, ఏపీ ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రమేష్ గారు అత్యంత సమర్థుడని, పవన్ కళ్యాణ్ సరైన వ్యక్తిని ఎంపిక చేయడం పార్టీ శ్రేణులందరికీ ఎంతో ఆనందాన్ని ఇస్తోందని జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు ప్రశంసించారు.

# అప్పుల కుప్పగా సింగరేణి

కాం గ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నరేండ్లలోనే రూ.12వేల కోట్ల పైచిలుకు బకాయిలు పేరుకుపోయాయని స్పష్టంచేశారు. ఒకవైపు, బొగ్గు బకాయిలు ఇవ్వకుండా సింగరేణి డబ్బులతో సోకులకు పోయి మూసీ సుందరీకరణ పేరిట లక్ష కోట్లు, ఫ్యూచర్‌సిటీ పేరుతో మరో రూ.లక్ష కోట్లు ఖర్చు చేసేందుకు సీఎం రేవంత్ సిద్ధమవుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో సింగరేణి సంస్థను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి 19వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పిస్తే, రేవంత్‌రెడ్డి ప్రభు త్వం ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

గతంలో ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం సింగరేణిలో గోల్డెన్ హ్యాండ్‌షేక్ పథకాన్ని తీసుకొచ్చి ఉద్యోగాలు ఊడగొడితే, చంద్రబాబు బంటుగా ఉన్న రేవంత్ నాడు కేసీఆర్ ఇచ్చిన 19వేల డిపెండెంట్ ఉద్యోగాలపై విచారణ చేస్తామనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఇప్పటికే డిపెండెంట్ ఉద్యోగాలను పోగొట్టి మెడికల్ బోర్డులు నిర్వహించకుండా అడ్డుకుంటూ కార్మికుల నోట్లో మట్టికొట్టిన రేవంత్ ప్రభుత్వంపై కార్మికులు గుర్రుగా ఉన్నారని చెప్పారు. కార్మికులు ఎవరిని అడిగినా ఇప్పు డు 'కాంగ్రెస్ హటావో.. సింగరేణి బచావో' అని ముందుకు సాగుతున్నారన్నారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ కుంభకోణాల మ యంగా మారిందని హరీశ్‌రావు ఆరోపించా రు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో సైట్‌విజిట్ పేరుతో స్కామ్, సోలార్ విద్యుత్తు పేరుతో స్కామ్, బొగ్గు ఉత్పత్తి రాకుండా వచ్చినట్టు చూపించే స్కామ్.. ఇలా ఎన్నో కుంభకోణాలతో సింగరేణి భవితవ్యం ప్రశ్నార్థంగా మారిందని దుయ్యబట్టారు. 'సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో సైట్‌విజిట్ నిబంధన విధించి రేవంత్‌రెడ్డి తన బామ్మర్ది సృజన్‌రెడ్డికి కాంట్రాక్ట్ ఇచ్చింది నిజం కాదా? సోలార్ విద్యుత్తు పేరుతో పెద్ద మొత్తంలో కమీషన్లు కొల్లగొట్టడానికి పథకం రచించింది నిజం కాదా?' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పోరాటంతో నైనిబ్లాక్‌ను రద్దు చేశారని గుర్తుచేశారు.

# రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అని పేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

# చమురు మార్కెట్‌లో
# భారత్ విశ్వరూపం!

ప్రకారం.. భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకుపోతుండటంతో దేశీయంగా ఇంధన వినియోగం భారీగా పెరగనుంది. భారత్‌లో వృద్ధి:2035 నాటికి దేశంలో చమురు వినియోగం '44 శాతం వృద్ధితో'.. ప్రతిరోజూ సుమారు 80 లక్షల బ్యారెళ్లకు చేరుకోనుంది.ప్రపంచ సగటు: భారత్‌తో పోలిస్తే మిగిలిన ప్రపంచ దేశాలలో ఈ వృద్ధి కేవలం 5 శాతం లోపే' పరిమితం కానుంది.

### గ్లోబల్ ఎనర్జీ హబ్‌గా భారత్

ప్రపంచంలోని ఇతర పెద్ద దేశాల ఆర్థిక రంగాలు మందగమనంలో సాగుతుండగా, భారత్‌లో పారిశ్రామికీకరణ, రవాణా రంగాలు ఊపందుకోవడం వల్లే ఈ స్థాయి డిమాండ్ ఏర్పడుతోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన రంగాన్ని శాసించే శక్తిగా భారత్ అవతరించబోతోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం.

# ఆపరేషన్ లోటస్ ప్రారంభం

**హైదరాబాద్,** తెలంగాణలో బీజేపీ పుంజుకునే ప్రయత్నంలో పడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ లను తట్టుకుని తెలంగాణలో ముందుకు రావడం అంత సులువు కాదు. అందుకే రానున్న కాలంలో బీజేపీలో కీలక నేతలను ఆ పార్టీల నుంచి చేర్చుకునే అవకాశముంది. ఇప్పటి నుంచే నియోజకవర్గాల వారీగా తెలంగాణలో బీజేపీ సర్వేలు చేయిస్తుంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ గెలుపు గుర్రాలకు మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం అవసరమైతే ఇతర పార్టీల నేతలను కూడా ఆహ్వానించి వారికి కండువా కప్పేయాలని డిసైడ్ అయింది. దక్షిణాదిన బలపడాలనుకుంటున్న బీజేపీ తెలంగాణను లక్ష్యంగా చేసుకుంది.వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావించి పార్టీ కేంద్ర నాయకత్వం తరచూ రాష్ట్ర నాయకులతో సమావేశమవుతున్నారు. నేతలంతా సమైక్యంగా నిలిచి ఇతర పార్టీల నేతలను ఆహ్వానించేందుకు అవసరమైన స్కెచ్ లను రూపొందించాలని ఇప్పటికే రాష్ట్ర పార్టీ నేతలకు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణలో గత శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను, పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను గెలుచుకున్న సంగతి తెలిసిందే. మరికొంత గట్టిగా ప్రయత్నిస్తే ఈసారి అధికారంలోకి రావడం ఖాయమని అంటున్నారు.బీఆర్ఎస్ లో కీలక నేతలను రప్పించడానికి కూడా కేంద్రం స్థాయిలో నేతలు పావులు కదుపుతున్నారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఊపందుకుంది. ఇప్పటికే పార్టీ నాయకత్వంపైన, మరోసారి అధికారంలోకి వస్తామన్న నమ్మకం లేని కొందరు నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్లు గుర్తించిన అధినాయకత్వం త్వరలోనే ఆపరేషన్ ను ప్రారంభించే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొందరు నేతలు బీజేపీ టాప్ లీడర్లతో టచ్ లోకి వెళ్లారని, అయితే సర్వే నివేదికలు వచ్చిన తర్వాత మాత్రమే వీరి చేరికలు ఉంటాయని చెబుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో బీజేపీ భారీ స్కెచ్ తో ముందుకు వెళుతుంది. మరి చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

**నార్త్ తెలంగాణ...** ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ ఒక నిశ్శబ్ద విప్లవానికి తెరలేపింది. గతంలో తాము జెండా పాతిన దుబ్బాక, హుజూరాబాద్‌లతో పాటు ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో కాషాయ దళం ప్రయోగించిన హైపర్ లోకల్ గ్రౌండ్ స్ట్రాటజీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ప్రత్యర్థుల వ్యూహాలకు చిక్కకుండా, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ పునాదులను కదిలించేలా బీజేపీ మాస్టర్ ప్లాన్ వేసింది.ప్రస్తుతం తెలంగాణ పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు, స్థానిక కమిటీల నియామకాలు, పాత సివిల్ వివాదాల చుట్టూ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ రెండు పార్టీల గ్రూపు తగాదాలతో విసిగిపోయిన తటస్థ ఓటర్లను, ఏ వర్గంలోనూ చేరలేక ఇబ్బంది పడుతున్న సగటు గ్రామీణ యువతను బీజేపీ చాకచక్యంగా తన వైపు తిప్పుకుంటోంది.స్థానికంగా ఎవరు గెలిచినా పాత కక్షలు తప్పవని.. అదే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో నడిస్తే పొలిటికల్ ప్రొటెక్షన్ ఉంటుందని వివరిస్తోంది. బలమైన భరోసాను ఇస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కేడర్ నైరాశ్యాన్ని క్యాష్ చేసుకుంటోంది. పెద్దగా ప్రెస్ మీట్లు పెట్టకుండానే, ఊళ్లల్లో ప్రత్యామ్నాయ శక్తులుగా బీజేపీ స్థానిక నాయకత్వం ఎదుగుతోంది.ఉత్తర తెలంగాణ రాజకీయాలను ఎప్పుడూ కుల సమీకరణాలే శాసిస్తాయి. దీనిని పక్కాగా అర్థం చేసుకున్న కాషాయ దళం.. ఈ సారి సరికొత్త సోషల్ ఇంజనీరింగ్‌కు తెరలేపింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో కింది సామాజిక వర్గాలను టార్గెట్ చేసింది. బలమైన బీసీ సామాజిక వర్గాలైన మున్నూరు కాపు, పద్మశాలి, యాదవ, గౌడ, ముదిరాజ్ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశమవుతోంది. దళిత, గిరిజన ఉపకులాల స్థానిక పెద్దలతో చర్చలు జరుపుతోంది.గ్రామంలో ఐదారు కుటుంబాలను లేదా కనీసం 10 ఓట్లను ప్రభావితం చేయగల సామర్థ్యం ఉన్న ఈ కీలక వ్యక్తులను బీజేపీ నేతలు నేరుగా కలిసి మాట్లాడుతున్నారు. వారి సామాజిక సమస్యల పరిష్కారానికి తాము ఉన్నామంటూ ఒక సామాజిక అనుబంధాన్ని ముమ్మరంగా పెంచుకుంటున్నారు. ఈ మైక్రో లెవెల్ ప్లానింగ్ వల్ల పైకి ఓటర్లు సైలెంట్‌గా ఉన్నా, లోపల మాత్రం కాషాయం వైపు మొగ్గు చూపుతున్నారు.గ్రామాల్లో ఉండే యువజన సంఘాలు, డిజిటల్ నెట్‌వర్క్‌లను బీజేపీ లీడర్లు అత్యంత చాకచక్యంగా వాడుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ పతాక స్థాయి పథకాలు, ఉపాధి అవకాశాలను వివరిస్తూ వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. వ్యవసాయ రంగంలో స్థానిక రైతు గ్రూపులతో మమేకమవుతూ.. పంటల కొనుగోళ్లు, స్థానిక మౌలిక వసతుల లోపాలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలుగా ప్రొజెక్ట్ చేయడంలో సక్సెస్ అవుతున్నారు. ఫలితంగా, యూత్ క్లబ్‌లు, రచ్చబండల దగ్గర పొలిటికల్ డిస్కషన్స్ నెమ్మదిగా బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయి.ఈ నిశ్శబ్ద ఆపరేషన్ అంతా తక్షణ హడావుడి కోసం కాదు, రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి ఉత్తర తెలంగాణను బీజేపీకి బలమైన కోటగా మార్చడమే దీని ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ అధికార బలంతో, బీఆర్ఎస్ పాత క్యాడర్ బలంతో కొట్టుకుంటుంటే.. బీజేపీ ఏకంగా ఓటు బ్యాంక్ పునాదులనే మార్చేస్తోంది. క్షేత్రస్థాయిలో కుల సంఘాల మద్దతు, తటస్థుల భరోసా తోడైతే, రాబోయే రోజుల్లో ఉత్తర తెలంగాణలో బీజేపీని ఢీకొట్టడం ప్రత్యర్థులకు అంత సులువు కాదనేది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# ఎయిర్ పోర్టుకు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ..

**హైదరాబాద్,** తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లై ఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వైపు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ.. కాటేదాన్ టు శంషాబాద్ రోడ్ వయా మైలార్‌దేవ్‌పల్లి ఫ్లై ఓవర్‌ను ప్లాన్ చేసింది. మొత్తం రూ.189.68 కోట్లతో ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ కొత్త ఫ్లై ఓవర్ పనులు ప్రారంభించే అవకాశం ఉంది అంటున్నారు.హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.. అందుకు తగిన విధంగా మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించింది. ముఖ్యంగా నగరంలో రోజు, రోజుకు ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. భాగ్యనగరంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలను నిర్మిస్తున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో కొత్త ఫ్లైఓవర్ (బై డైరెక్షనల్ గ్రేడ్ సెపరేటర్) నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాటేదాన్ టు శంషాబాద్ రోడ్ వయా మైలార్‌దేవ్‌పల్లి మీదుగా ఆరు లేన్ల ఈ ఫ్లైఓవర్నాన్ చేసింది. మొత్తం రూ. 189.68 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ పూర్తికాగా.. తాజాగా ఏజెన్సీ ఎంపికకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ప్రభుత్వం హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటీవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)లో భాగంగా ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలు సాగించేలా ఈ నిర్ణయం తీసుకుంది. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌వైపు రాకపోకలు సాగించేవారితో పాటుగా, స్థానికంగా ఉండే ట్రాఫిక్‌తో పాటుగా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ కారణంగానే తరచూ ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు.. ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కోసం ఈ వంతెన ప్లాన్ చేశారు.ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి మొత్తం రూ.189.68 కోట్లతో మూడు జంక్షన్‌ల దగ్గర సిగ్నల్ ఫ్రీ జర్నీ కోసం బ్రిడ్జిని ప్రతిపాదించారు. ఈ వంతెనకు సంబంధించిన టెండర్ విషయానికి వస్తే.. కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్‌ను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మరో రెండు కాంట్రాక్ట్ సంస్థలు కూడా బిడ్‌లు దాఖలు చేయగా.. అంచనా కంటే ఎక్కువ కోట్ చేశాయి. కేఎన్ఆర్ కాంట్రాక్ట్ సంస్థ మాత్రం 189.68 కోట్లు (4.71 శాతం) కోడ్ చేసింది. అధికారులు టెక్నాలజీతో పాటుగా ప్రైస్ బిడ్‌ను పరిశీలించారు.

. ఆ వివరాలను జీహెచ్ఎంసీ మున్సిపల్ శాఖకు పంపించింది. అనంతరం ఎల్-1 బిడ్డర్‌గా ఉన్న కేఎన్ఆర్ సంస్థను ఎంపిక చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు వెంతన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.హైదరాబాద్ సిటీలోని అన్ని ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు.. వారికి ఊరట దక్కనుంది. అలాగే ఫలక్‌నుమా, బహదూర్‌పురా, బండ్లగూడ, చాంద్రాయణగుట్టతో సహా పలు ప్రాంతాలవారికి వినామాశ్రయానికి రాకపోకలు సులువు కానున్నాయి. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవని చెబుతున్నారు. ఇప్పటికే కేబీఆర్ పార్కు జంక్షన్, ఫాక్స్ సాగర్ బ్రిడ్జి, గచ్చిబౌలి ఐఐఐటీ జంక్షన్ ఏరియాల్లో బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభించారు. వీటితో పాటుగా పంజాగుట్టలోని ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్, అల్వీన్ కాలనీ, రసూల్‌పుర జంక్షన్ల దగ్గర కూడా ఫ్లై ఓవర్ల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది.

# రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి




అమరావతి : ఏపీలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు ( Couple ) మృతి చెందారు. సామర్లకోటకు చెందిన సత్యనారాయణ ( 45 ), అరుణకుమారి ( 40 ) ద్విచక్రవాహనంపై సొంత ఊరుకు వెళ్తుండగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు వద్ద లారీ ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు.

# తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేలు

**అదిలాబాద్** తెలంగాణలో కొత్తగా మరో రెండు జాతీయ రహదారులకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సీసీఈఏ (ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ) సమావేశంలో ఆమోదించారు. ఈ రెండు నేషనల్ హైవేలలో ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563) సెక్షన్ల అభివృద్ధి చేయనున్నారు. ఎన్‌హెచ్ఏఐ గత ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు హైవేలకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు ప్రక్రియను పూర్తి చేసింది. సీసీఈఏ ఆమోదంతో ఈ ఏడాది పనులు ప్రారంభంకానున్నాయి. తెలంగాణలో రెండు కొత్త నేషనల్ హైవేల కోసం రూ.7,597.16 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించారు. మూడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం 190 కిలోమీటర్ల పొడవున నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయనున్నారు.జగిత్యాల-కరీంనగర్ హైవేను బీవోటీ పద్ధతిలో నిర్మిస్తారు. ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63) పనులను హ్యామ్ పద్ధతిలో పూర్తి చేస్తారు. ఈ కొత్త హైవే అందుబాటులోకి వస్తే ఆర్మూర్-మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం దాదాపుగా గంటన్నర వరకు తగ్గుతుందని చెబుతున్నారు. అలాగే జగిత్యాల-కరీంనగర్ మధ్య హైవేతో 45 నిమిషాలు తగ్గనుందంటున్నారు. ఈ రెండు జాతీయ రహదారుల్ని పీఎం గతిశక్తి పథకానికి అనుగుణంగా రూపొందిస్తున్నారు. ఈ రెండు నేషనల్ హైవేలను పలు ప్రాజెక్టులకు అనుసంధానం చేయనున్నారు. వీటిలో ఆర్థిక కేంద్రాలు, సామాజిక కేంద్రాలు, లాజిస్టిక్ కేంద్రాలు కూడా ఉన్నాయిఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల నేషనల్ హైవే 63 నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మీదుగా వెళుతుంది. జగిత్యాల-కరీంనగర్ నేషనల్ హైవే విషయానికి వస్తే.. పోతారం, గంగాధర, కరీంనగర్ వరకు వెళుతుంది. ఈ హైవేలలో బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. గంటలకు 100 కిలోమీటర్ల స్పీడ్ వెళ్లేలా రోడ్లను డిజైన్ చేశారు. ఈ రెండు హైవేలు ఫిషింగ్ సీఫుడ్ క్లస్టర్, పలు రైల్వే స్టేషన్‌లను కనెక్ట్ చేయనున్నాయి. మొత్తం మీద త్వరలోనే కొత్త జాతీయ రహదారులు నిర్మాణం కాబోతున్నాయి. వాస్తవానికి సీసీఈఏ సమావేశంలో ఈ రెండు జాతీయ రహదారులతో పాటుగా ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనులకు సంబంధించి ఆమోదం లభిస్తుంది అనుకున్నారు.. ఆ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.. ఆమోదం లభించలేదు.

# మీ ఏరియా వాల్యూ ఎంతో తెలుసా

**హైదరాబాద్** రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్టుమెంట్లు, ఇళ్లకు కొత్త మార్కెట్ విలువ శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లన్నీ 5వ తేదీ నుంచి కొత్త విలువ ఆధారంగానే జరగనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగు భూములు, ఖాళీ స్థలాలకు మార్కెట్ విలువను 50 నుంచి 100శాతంకు పెంచగా.. అపార్టుమెంట్లకు సంబంధించి 10 శాతం నుంచి 20శాతం వరకు పెంపుదల జరిగింది. కొన్ని ప్రాంతాల్లో పాత విలువనే కొనసాగించారు. అయితే, రాష్ట్రంలో కనిష్ఠంగా భూముల ధర ఇంతకుముందు ఎకరా రూ.1.75 లక్షలు ఉండగా దాన్ని రూ.2.75 లక్షలకు పెంచారు.

# మార్కెట్లో నకిలీ విత్తనాలు...

**అదిలాబాద్,** ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చుకుని పంటలు పండించే రైతులకు చీడ, పీడలతోనే కాదు.. రైతు సమాజానికి చీడపురుగుల్లా దాపురించిన నకిలీ విత్తన విక్రేతలతోనూ ప్రమాదం ఏర్పడింది. వీరితో జాగ్రత్తగా లేకుంటే రైతుల వ్యవసాయానికి మొదటికే మోసం వచ్చేలా పరిస్థితులున్నాయని అధికారులంటున్నారు. తమ కంపెనీ విత్తనాలు వాడితే పంట సాగులో చీడ పీడల బెడద ఉండదని, వాటి నివారణ కోసం ప్రత్యేకంగా ఎలాంటి ఎరువులు వాడాల్సిన అవసరమే రాకుండా పంటలు సాగు చేయొచ్చనే ఆశలు చూపించి అమాయక రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లో చొరబడ్డారు. వారిని నియంత్రించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది.కొత్త కొత్త బ్రాండ్లతో రైతులకు విత్తనాలను అంట గట్టేందుకు మహారాష్ట్ర లోని కొన్ని నాసిరకం విత్తన తయారీ సంస్థల్లో తయారైన విత్తనాలను జిల్లాలో మార్కెటింగ్ కోసం తీసుకొచ్చి జిల్లాలో కొందరు సీడ్స్ షాపులకు సప్లై చేస్తునట్లు తెలుస్తోంది. ఆయా కంపెనీల ప్రతినిధులు నేరుగా అయాయక రైతులకే అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు. నకిలీ విత్తన విక్రేతలు మార్కెట్ లోకి వచ్చేశారు. నేరుగా రైతులకే కాకుండా విత్తనాల డీలర్లకు కూడా ఎక్కువ మొత్తంలో కమిషన్ ఆశ చూపి తమ కంపెనీలకు చెందిన విత్తనాలను ఎక్కువ మొత్తంలో మార్కెట్లో విక్రయించేలా ప్లాన్ చేస్తున్నారు. అయాయక చిన్న సన్నకారు రైతులను ఈ నకిలీ విత్తన విక్రేతలు బురిడీ కొట్టించి నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం పొంచి ఉంది.ఇప్పటికే కొన్ని కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీకి చెందిన బ్రాండ్ల విత్తనాల గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తూ సీడ్స్ మార్కెట్ చేస్తున్నట్లు రైతులు అంటున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై నకిలీ విత్తనాల విషయంలో ఓ పక్క రైతులను చైతన్యపరుస్తూనే, మరో పక్క నకిలీ విత్తనాల నియంత్రణ కోసం వ్యవసాయ శాఖ, పోలీస్, రెవెన్యూ తదితర ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలతో జిల్లా వ్యాప్తంగా సీడ్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఈ టాస్క్ ఫోర్స్ టీంలు విస్తృతంగా తిరుగుతూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండటంతో సీడ్స్ షాప్ నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు.జిల్లాలో 455 విత్తనాలు విక్రయించే రిజిష్టర్డ్ షాప్స్ ఉన్నాయి. రైతులు ప్రతి సీజన్ లో తమకు అందుబాటులో ఉన్న షాపుల్లో రెగ్యులర్ గా వెళ్లి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రిజిస్ట్రార్డ్ సీడ్స్ షాపుల్లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి సీడ్స్ అమ్మకాలు జరపాల్సి ఉంది. కొన్ని షాపుల్లో ఎక్కువ మొత్తంలో కమిషన్లు చెల్లించే కంపెనీలకు చెందిన బ్రాండ్లు కూడా అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధలను విరుద్ధంగా అమ్మాల్సిన కొత్త కంపెనీలకు చెందిన విత్తనాలను షాపుల్లో కాకుండా ఇతర రహస్య ప్రాంతాల్లో ఉంచి వాటిని కావాలనుకున్న రైతులకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయ పనుల కోసం రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వర్షాలు కురవడం ప్రారంభం కాగానే వ్యవసాయ పనులు కూడా ఊపందుకోనున్న తరుణంలో రైతులు ముందుగా విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాల ఏరివేతకు, వాటి నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్ ఫోర్స్ టీంలు అన్ని సీడ్స్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. ఎక్కడా ఏ షాపును వదలకుండా అన్ని షాపులను ఈ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. షాపుల్లో ఎలాంటి అనుమానాస్పద ప్రొడక్ట్ కనిపించిన.. అవి నకిలీ విత్తనాలని తేలినా చట్టపరమైన చర్యలు తప్పవని, షాపు లైసెన్సు కూడా రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలు లేని జిల్లాగా రైతులు ఆరోగ్యకరమైన వ్యవసాయం చేసుకునే వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వీరాస్వామి అన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, ప్రతి మంగళవారం రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తున్న సమావేశాల్లో కూడా రైతులకు నకిలీ విత్తనాలపై ఏడీఏలు, ఏఈఓ లు అవగాహన కల్పిస్తున్నట్లు జేడీఏ తెలిపారు. అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన విత్తనాలు విక్రయించే షాపులన్నింట్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నటు తెలిపారు.

# అడుగంటుతున్న భూగర్భజలాలు

**హైదరాబాద్** నగరంలో భూగర్భ జలాలు ముందు ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయికి పడిపోతున్నాయి. భూగర్భంలో దాగున్న నీటిని పైకి తీసుకురావాలనే తాపత్రయంతో నగరవాసులు వందలాది మీటర్ల లోతుకు బోర్ల తవ్వకాలు జరుపుతున్నారు. ఎటు చూసినా బోరుబావుల యంత్రాలు తిరుగుతూ విచ్చలవిడిగా కొత్త బోర్లు తవ్వేస్తున్నాయి. నివాస సముదాయాల్లో పాత బోరుబావులు ఎండిపోవడంతో, ప్రత్యామ్నాయంగా భూగర్భాన్ని జల్లెడగా మారుస్తూ కొత్తవాటిని వేయిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బోరింగ్ మిషన్ల శబ్దాలు మార్మోగుతున్నాయి. గత 15 రోజుల వ్యవధిలోనే నగర వ్యాప్తంగా సుమారు 2,500కి పైగా కొత్త బోర్లు వేసినట్లు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే ముమ్ముందుకూ కొనసాగితే నగరంలో తీవ్రమైన జల సంక్షోభం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ సంవత్సరం మే నెలలో గరిష్ట స్థాయిలో నమోదైన తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భ జలాలు గతంలో కంటే సగటున 5 నుంచి 10 మీటర్ల మేర కిందికి దిగజారాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని గచ్చిబౌలి, మాదాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాలతో పాటు అమీర్‌పేట్, కూకట్‌పల్లి, ఉప్పల్ పరిసరాల్లో భూగర్భ జలాలు అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. గత సంవత్సరం మే నెలతో పోల్చి చూస్తే.. ఈసారి దాదాపు 8 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోయినట్లు భూగర్భ జల వనరుల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో వందల మీటర్లలో పడిన నీరు ఇప్పుడు కనీసం 1000 నుంచి 1500 మీటర్ల లోతుకు దాటిపోయింది. అయినా సరే కొన్ని చోట్ల చుక్క నీరు కూడా రావడం లేదు. నగరంలో ప్రస్తుతం పాత బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో, నివాసితులు కొత్త బోర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లలో నీటి అవసరాలు తీరక రికార్డు స్థాయిలో లోతైన బోర్లు వేస్తున్నారు.నగరం తన పచ్చదనాన్ని కోల్పోయి కాంక్రీట్ వనంగా మారడమే ఈ ప్రస్తుత దుస్థితికి ప్రధాన కారణంగా మారుతోంది. ప్రతి ఇల్లూ, అపార్ట్‌మెంట్ చుట్టూ సిమెంటింగ్ చేయడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అసలు అవకాశం లేకుండా పోయింది. గతంలో చెరువులు, కుంటలు, ఖాళీ స్థలాలు వరద నీటిని పట్టి ఉంచి భూగర్భ జలాలను పెంచేవి. కానీ నేడు ఆ స్థలాలన్నీ బహుళ అంతస్తుల భవనాలుగా మారిపోవడంతో, పడే వర్షపు నీరంతా వృధాగా డ్రైనేజీల ద్వారా నాలాల్లోకి కొట్టుకుపోతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే రంగారెడ్డినగర్ వంటి ప్రాంతాల్లో గురువారం యథేచ్ఛగా బోర్ల తవ్వకాలు జరపడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

# అల్లం వెల్లుల్లి పేస్ట్ కొంటున్నారా..?

ఏ కర్రీకైనా మంచి రుచి రావాలి అంటే తప్పకుండా ఆ వంటల్లో ఉండాల్సిందే అల్లం వెల్లుల్లి పేస్ట్. ఇది వంటలకు రుచిని ఇవ్వడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. అయితే కొంత మంది అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను బయట కొనుగోలు చేస్తారు. కానీ దీని వలన అనేక నష్టాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. కర్రీ రుచిని నాలుగు రెట్లు పెంచే అల్లం వెల్లుల్లి పేస్ట్ ప్రతి ఒకరి వంట రూమ్‌లో తప్పక ఉంటుంది. ఎందుకంటే ఇది వంటలకు ప్రత్యేక రుచిని అందించడంలో మేటి. ముఖ్యంగా నాన్ వెజ్ వంటకాలు వండి తప్పకుండా అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉండాల్సిందే అంటారు. చికెన్, మటన్, ఫిష్ వంటి వలకు ఇది అద్భుతమైన రుచిని అందిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఇంట్లోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకొని పెట్టుకుంటారు. కర్రీ రుచిని నాలుగు రెట్లు పెంచే అల్లం వెల్లుల్లి పేస్ట్ ప్రతి ఒకరి వంట రూమ్‌లో తప్పక ఉంటుంది. ఎందుకంటే ఇది వంటలకు ప్రత్యేక రుచిని అందించడంలో మేటి. ముఖ్యంగా నాన్ వెజ్ వంటకాలు వండి తప్పకుండా అల్లం వెల్లుల్లి పేస్ట్ ఉండాల్సిందే అంటారు. చికెన్, మటన్, ఫిష్ వంటి వలకు ఇది అద్భుతమైన రుచిని అందిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఇంట్లోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకొని పెట్టుకుంటారు. కానీ ఈరోజుల్లో కొంత మంది తమ బిజీ షెడ్యూల్ కారణంగా ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకోకుండా, బయట నుంచి కొనుగోలు చేసుకొని వంటల్లో ఉపయోగిస్తున్నారు. కానీ ఇది ఆరోగ్యానికి అస్సలే మంచిది కాదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే ప్యాకింగ్ చేసిన అల్లం వెల్లుల్లి పేస్ట్ చాలా వరకు కల్తీనే ఉంటుందంట. అంతే కాకుండా ఇది వంటలకు అంతగా రుచిని ఇవ్వకపోవడమే కాకుండా, అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందంట. ఎందుకంటే? సహజంగా తయారు చేసినది చాలా తాజాగా, ఎలాంటి రసాయనలు లేకుండా ఉంటుంది. కానీ మార్కెట్లో లభించే అల్లం వెల్లుల్లి పేస్ట్ అనేక



రకాల రసాయనాలతో తయారు అవుతుందంట. అందుకే బయట అల్లం వెల్లుల్లి పేస్ట్ కొనుగోలు చేసేటప్పుడు దానిని సరిగ్గా చూసి, కల్తీని గుర్తించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. తాజా అల్లం ఘాటు వాసనతో లేత గోధుమ రంగులో ఉంటుంది. కల్తీ అయిన అల్లం వెల్లుల్లి పేస్ట్ పుల్లగా ఉంటుందంట. అలాగే ఫ్రెష్ అల్లం వెల్లుల్లి పేస్ట్ మందంగా చాలా సన్నగా అస్సలే ఉండదంట. అలాగే అల్లం వెల్లుల్లి పేస్ట్ ప్యాకెట్ పై అల్లం, వెల్లుల్లి కాకుండా నీరు ఉప్పు రాసి ఉంటే అస్సలే ఆ ప్యాకెట్ కొనుగోలు చేయకూడదంట. అంతే కాకుండా అల్లం వెల్లుల్లి పేస్ట్ ముదురు రంగులో, నీళ్లలా ఉంటే కూడా అది కల్తీ అని భావిచాలంటున్నారు నిపుణులు.


# ఆ సమస్యని దూరం చేయడంలో.. జాజికాయను మించింది లేదు..!



జాజికాయ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఇచ్చే ఒక ప్రత్యేక సుగంధ ద్రవ్యం. ఇది మన ఆరోగ్యాన్ని బాగు చేయడంలో సాయపడుతుంది. ఇందులో శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు ఉంటాయి. జాజికాయలో మిరిస్టిసిన్, యూజినాల్, ఐసోయుజెనాల్, సఫ్రోల్ లాంటివి ఉంటాయి. ఇవి మన శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ ఒత్తిడి తగ్గడం వల్ల కణాలు పాడవకుండా ఉంటాయి. ఎక్కువ ఒత్తిడి వల్ల వచ్చే జబ్బులు పెరగకుండా ఇది అడ్డుకుంటుంది. జాజికాయ వాడకం వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. మిరిస్టిసిన్ లాంటివి మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. డిప్రెషన్, ఆందోళన లాంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. నిద్ర సరిగా రాని వారికి ఇది సాయం చేస్తుంది. మనసును శాంతపరిచి, మంచి నిద్రకు దారితీస్తుంది. జాజికాయలో ఉండే గుణాలు గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్ణం లాంటి సమస్యలను తగ్గిస్తాయి. భోజనం తిన్న తర్వాత కడుపులో కలిగే ఇబ్బందిని తగ్గించడంలో ఇది సహజంగా పనిచేస్తుంది. కడుపుకు సంబంధించిన ఇబ్బందులను దూరం చేస్తుంది. ఆర్థరైటిస్, కీళ్ల నొప్పులు, జీవక్రియ సమస్యల వల్ల వచ్చే మంటను తగ్గించడంలో జాజికాయ ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే గుణాలు శరీరంలో నొప్పిని, మంటను తగ్గిస్తాయి. నొప్పులు, మంట ఉన్న వారికి ఇది ఒక మంచి పరిష్కారం. జాజికాయ ఒక సహజ ఆఫ్రోడిసియాక్. కొన్ని పరిశోధనలు ఇది లైంగిక కోరికను పెంచుతుందని చూపించాయి. ముఖ్యంగా మగవారిలో ఇది బాగా పనిచేస్తుంది. లైంగిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇది సాయం చేస్తుంది. ఒత్తిడిగా ఉన్నవారికి నిద్ర సరిగా పట్టదు. ఇది ఒక సాధారణ సమస్య. రాత్రి పడుకునే ముందు పాలలో కొద్దిగా జాజికాయ పొడి కలిపి తాగితే నాడీ వ్యవస్థకు విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల నిద్ర బాగా పడుతుంది. ఇది మెదడును శాంతపరిచి సహజంగా నిద్ర వచ్చేలా చేస్తుంది. జాజికాయలో చెడు సూక్ష్మజీవులను అడ్డుకునే గుణాలు ఉంటాయి. ఇది నోటిలో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను తొలగించడంలో సాయం చేస్తుంది. దీనివల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది. చిగుళ్లకు వచ్చే ఇన్ఫెక్షన్లను కూడా ఆపొచ్చు. చర్మానికి వచ్చే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలను తగ్గించడంలో జాజికాయ ఉపయోగపడుతుంది. దీనిలో ఉండే బ్యాక్టీరియా నిరోధక గుణాలు చర్మాన్ని శుభ్రంగా ఉంచుతాయి. చర్మం మృదువుగా మారేలా చేస్తాయి. ఇది చర్మ సమస్యలకు ఒక సహజ పరిష్కారం. జాజికాయ చిన్న సుగంధ ద్రవ్యం అయినా.. దాని ఆరోగ్య లాభాలు ఎన్నో. దీన్ని జాగ్రత్తగా.. తగినంత వాడితే శరీర ఆరోగ్యం, మనసు ప్రశాంతత, జీర్ణ శక్తి, చర్మ ఆరోగ్యం మెరుగుపడుతాయి.

# ల్యాప్‌టాప్‌ను ఇలా ఉపయోగిస్తున్నారా..?

వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరిగింది. దీని వల్ల చాలామంది ఇంటి నుంచి పని చేస్తున్నారు.



దీని కారణంగా ల్యాప్‌టాప్‌ల వాడకం ఎక్కువైంది. అయితే ల్యాప్‌టాప్‌ని ఎక్కువగా ఉపయోగించడం వల్ల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. రోజంతా ల్యాప్‌టాప్ ఉపయోగించడం వల్ల శరీరంపై చెడు ప్రభావం చూపుతోంది. ల్యాప్‌టాప్ నుంచి వెలువడే వేడి వల్ల చర్మం, అంతర్గత కణజాలం దెబ్బతింటున్నాయి. వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరిగింది. దీని వల్ల చాలామంది ఇంటి నుంచి పని చేస్తున్నారు. దీని కారణంగా ల్యాప్‌టాప్‌ల వాడకం ఎక్కువైంది. అయితే ల్యాప్‌టాప్‌ని ఎక్కువగా ఉపయోగించడం వల్ల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. రోజంతా ల్యాప్‌టాప్ ఉపయోగించడం వల్ల శరీరంపై చెడు ప్రభావం చూపుతోంది. ల్యాప్‌టాప్ నుంచి వెలువడే వేడి వల్ల చర్మం, అంతర్గత కణజాలం దెబ్బతింటున్నాయి. ల్యాప్‌టాప్ ఎక్కువ సేపు ఒడిలో పెట్టుకొని పని చేయడం వల్ల పురుషుల్లో సంతానలేమి సమస్యలు ఏర్పడుతాయి. అదే సమయంలో ఇంటర్నెట్ కనెక్షన్‌కి రేడియేషన్‌కి సంబంధించినది కాబట్టి ల్యాప్‌టాప్ కంటే వైఫైకి కనెక్ట్ చేయడం వల్ల ఎక్కువ నష్టం జరుగుతోంది. ల్యాప్‌టాప్ వేడి మహిళల కంటే పురుషులకే ఎక్కువ హాని చేస్తుంది. దీనికి కారణం శరీర ఆకృతి. స్త్రీలలో గర్భాశయం శరీరం లోపల ఉంటుంది. పురుషులలో పునరుత్పత్తి అవయవాలు బయట ఉంటాయి. దీని కారణంగా రేడియేషన్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుంది. అందుకే మగవాళ్లు ల్యాప్‌టాప్‌లు వాడేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అధిక ఉష్ణోగ్రత కారణంగా స్పెర్మ్ నాణ్యత దెబ్బతింటుంది. కాబట్టి సంతానోత్పత్తిలో సమస్యలు ఏర్పడుతాయి. ల్యాప్‌టాప్‌ను ఒడిలో ఉంచుకొని ఎక్కువసేపు పనిచేయడం కంటే ఇది ఇంకా చాలా డేంజర్. తక్కువ ఫ్రీక్వెన్సీ రేడియేషన్ హార్డ్ డ్రైవ్ నుంచి విడుదలవుతుంది. ఇది చాలా ప్రమాదం. దీనివల్ల నిద్రలేమి, తీవ్రమైన తలనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ల్యాప్‌టాప్‌ను ఒడిలో ఉంచుకోవడానికి బదులుగా కొంతమంది టేబుల్‌పై పెట్టుకొని పనిచేస్తారు. దీని కారణంగా ల్యాప్‌టాప్ రేడియేషన్ నేరుగా శరీరంపై పడుతుంది. దీని నుంచి వెలువడే వేడి మిమ్మల్ని అనారోగ్యానికి గురి చేస్తుంది. ల్యాప్‌టాప్‌ను నిరంతరం ఉపయోగించడం మానుకోండి. ఇది కండరాలలో నొప్పిని కలిగిస్తుంది.

# బరువు తగ్గించే పిల్స్ వాడుతున్నారా?



వేగంగా బరువు తగ్గాలనే కోరిక, ఊబకాయం పెరుగుదల, శరీర ఆకృతి పట్ల పెరుగుతున్న ఆందోళన... ఈ కారణాలతో బరువు తగ్గించే మాత్రల వాడకం భారతదేశంలో విపరీతంగా పెరిగింది. అయితే, ఈ మాత్రలు నిజంగా సురక్షితమేనా? ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయా, లేక ప్రమాదకరం కావా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిపుణులైన వైద్యులు ఈ బరువు తగ్గించే మాత్రల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, నష్టాలపై కీలక విషయాలను వెల్లడించారు. వేగంగా బరువు తగ్గాలనే ఆశ, ఊబకాయం పెరుగుదల, శరీర ఆకృతిపై పెరుగుతున్న ఆందోళన.. ఈ కారణాలతో బరువు తగ్గించే మాత్రల వాడకం ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగింది. ఈ మాత్రలను సాధారణంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి, వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో లభించే మందులు. మరొకటి, ఓవర్-ది-కౌంటర్ (రూజ) సప్లిమెంట్లు. ప్రిస్క్రిప్షన్‌తో లభించే వాటిలో ఆర్లిస్టాట్ వంటి కొవ్వును గ్రహించకుండా అడ్డుకునేవి, ఫెంటెర్మైన్ వంటి ఆకలిని అణచివేసేవి ఉన్నాయి. అయితే, ఆన్‌లైన్‌లో విక్రయించే, ఫిట్‌నెస్ నిపుణులు ప్రచారం చేసే, ఆయుర్వేద, మూలికా ఫార్ములేషన్లుగా చెప్పబడే ఓటీసీ "బరువు తగ్గించే మాత్రలు" చాలా వరకు నిబంధనలు లేకుండానే అమ్ముడవుతున్నాయి. ఈ మందులు వాడటం ఆపేసిన తర్వాత, ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, జీవనశైలి మారకపోతే, చాలా మంది మళ్లీ బరువు పెరుగుతారని వైద్యులు అంటున్నారు. సొంత వైద్యం, నియంత్రణ లేని సప్లిమెంట్ల వాడకం వలన తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. బరువు తగ్గించే మందుల వలన తరచుగా జీర్ణ సమస్యలు, రక్తపోటు పెరుగుదల, ఆందోళన, నిద్రలేమి, గుండె వేగం పెరగడం వంటి దుష్ప్రభావాలు కలుగుతాయి. కాలేయ నష్టం, హార్మోన్ల మార్పులు, ఇతర మందులతో చర్యలు వంటివి మరింత తీవ్రమైన సమస్యలకు దారి తీస్తాయి. వైద్య సలహా లేకుండా ఈ మందులు వాడినా, ఇతర మందులతో కలిపి తీసుకున్నా ప్రమాదం విపరీతంగా పెరుగుతుందని డాక్టర్ ఖితానీ హెచ్చరించారు. కొందరు ప్రజలు దుష్ప్రభావాలకు ఎక్కువ గురవుతారు. యువతరం, ఒత్తిడికి లోనై, తమ రూపం గురించి ఆందోళన చెందుతూ, నిరూపితం కాని ఉత్పత్తులను వాడతారు. మహిళలలో థైరాయిడ్ సమస్యలు, పీసీఓఎస్‌తో బాధపడేవారు ఈ మందులను విచక్షణారహితంగా వాడితే, అంతర్గత హార్మోన్ల సమస్యలు పెరిగే అవకాశం ఉంది. లివర్ కు రిస్క్.. కొన్ని సందర్భాలలో, ఓటీసీ బరువు తగ్గించే సప్లిమెంట్లను ఎక్కువ కాలం పాటు, అసంబద్ధంగా వాడటం వలన కాలేయ వైఫల్యం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వంటి తీవ్రమైన దుష్ప్రభావాలు తలెత్తినట్లు వైద్య నిపుణులు గుర్తించారు. ఇటీవల ఒక యువతి "ఆన్‌లైన్"లో లభించే "సహజ" ఫ్యాట్ బర్నర్‌ను వాడిన తర్వాత, ఆమె శరీరంలో ఆంఫెటమైన్ లాంటి పదార్థాలు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది.

# షుగర్ ఉన్నవారు బంగాళాదుంపలు తినొచ్చా..?



బంగాళాదుంపలు వండటానికి సులువుగా ఉంటాయి. రుచికరంగా కూడా ఉంటాయి కాబట్టి చాలా మంది వీటిని ఇష్టపడతారు. అయితే ఆరోగ్యానికి ముఖ్యంగా షుగర్ ఉన్నవారికి ఇవి మంచివా కాదా అనే ప్రశ్న చాలా మందిలో ఉంటుంది. బంగాళాదుంపలలో స్టార్చ్ అనే పిండి పదార్థం ఎక్కువగా ఉంటుంది. వాటిని ఉడికించినా లేదా వేయించినా ఈ పిండి పదార్థం శరీరంలోకి త్వరగా చేరి గ్లూకోజ్ గా మారుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. అందుకే షుగర్ జబ్బు ఉన్నవారు బంగాళాదుంపలను పూర్తిగా తినడం మానేయకపోయినా.. తక్కువ మోతాదులో మాత్రమే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. బంగాళాదుంపలు ఆరోగ్యానికి పూర్తిగా చెడు అని చెప్పడం సరికాదు. వాటిని ఎలా వండుతున్నాం అనేది ముఖ్యం. ఉదాహరణకు బంగాళాదుంపలను నూనె లేకుండా కాల్చడం లేదా తక్కువ నూనెతో గ్రిల్ చేయడం మంచి పద్ధతులు. ఇలా చేయడం వల్ల ఎక్కువ కొవ్వు చేరదు.. పోషకాలు కూడా కొంతవరకు అలాగే ఉంటాయి. అయినప్పటికీ షుగర్ ఉన్నవారు వీటిని తరచుగా లేదా ఎక్కువ మొత్తంలో తినడం మాత్రం మానేయాలి. బంగాళాదుంపలకు బదులుగా చిలగడదుంపలు తినడం చాలా మంచిది. వీటిలో షుగర్ పెంచే గుణం తక్కువగా ఉంటుంది. అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నెమ్మదిగా పెంచుతాయి. అంతేకాదు వీటిలో ఫైబర్, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. షుగర్ ఉన్నవారికి చిలగడదుంపలు ఒక మంచి ప్రత్యామ్నాయం. మనం తినే ఆహారం సరైన మోతాదులో, సమతుల్యంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచి చేస్తుంది. బంగాళాదుంపలను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. అయితే వాటిని ఎక్కువగా తింటే రక్తంలో షుగర్ స్థాయి పెరగడం, బరువు పెరగడం వంటి సమస్యలు రావచ్చు.

# పడుకునే ముందు దిండు కింద వెల్లుల్లి పెట్టుకుంటే..

నేటి ఆధునిక జీవనశైలిలో నిద్రలేమి ఒక పెద్ద సమస్యగా మారింది. చాలామంది రాత్రుళ్లు ప్రశాంతంగా నిద్రపట్టక ఇబ్బందులు పడుతుంటారు. ఇది శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అయితే, కొన్ని సులువైన ఇంటి చిట్కాలతో ఈ సమస్యను అధిగమించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాంటి అద్భుతమైన చిట్కాలలో ఒకటి, వెల్లుల్లిని దిండు కింద ఉంచుకోవడం. భారతీయ వంటకాల్లో వెల్లుల్లికి ప్రత్యేక స్థానం ఉంది. ఇది కేవలం రుచి, సువాసన కోసమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మనకు తెలియని ఎన్నో లాభాలు వెల్లుల్లిలో దాగి ఉన్నాయి. ఇటీవలి అధ్యయనాల ప్రకారం, వెల్లుల్లి మానవులకు మంచి నిద్రను అందించడంలో గణనీయంగా సహాయపడుతుంది. రాత్రి పడుకునే ముందు దిండు కింద ఒక వెల్లుల్లి రెబ్బను ఉంచుకుంటే, మీరు అనేక ప్రయోజనాలను పొందవచ్చు. వెల్లుల్లి పోషకాలకు నిలయం. ఇందులో విటమిన్-బి6, థయామిన్, పాంథోతేనిక్ యాసిడ్, విటమిన్-సి వంటి విటమిన్లు, అలాగే మాంగనీస్, ఫాస్ఫరస్, కాల్షియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. నిద్రకు ముందు దిండు కింద వెల్లుల్లిని ఉంచడం వల్ల దోమల బెడద తగ్గుతుంది. దీని సువాసన గది అంతా వ్యాపించి జలుబు, దగ్గు నుండి రక్షణ కల్పిస్తుంది. నిద్రలేమితో బాధపడేవారికి కూడా ఇది సహాయపడుతుంది. నిజానికి, వెల్లుల్లిలో ఉండే విటమిన్ బి1, బి6లు నాడీ వ్యవస్థకు మెలటోనిన్‌ను చేరవేయడంలో సహాయపడతాయి. ఇది ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది. ఇందులో ఉండే యాంటీ-టాక్సిన్ గుణాలు ముక్కు దిబ్బడను తగ్గించి, ఇన్‌ఫెక్షన్లు శ్వాసకోశ సమస్యల నుండి రక్షిస్తాయి. దిండు కింద ఒక వెల్లుల్లి రెబ్బను ఉంచడం వల్ల నిద్ర మెరుగుపడుతుంది. నిద్ర సంబంధిత రుగ్మతలు దూరమవుతాయని ప్రాచీన కాలం నుంచి నమ్మకం ఉంది. వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ వల్ల వచ్చే ఘాటైన వాసన నిద్రను ప్రేరేపించి, ప్రశాంతమైన ప్రభావాన్ని చూపుతుందని శాస్త్రీయంగానూ చెబుతున్నారు. దిండు కింద వెల్లుల్లి రెబ్బను ఉంచడం వల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. అయితే, మీకు వెల్లుల్లి ఘాటు వాసన నచ్చకపోతే, వెల్లుల్లితో తయారుచేసిన పానీయం కూడా మీ నిద్ర సమస్యలను సరిచేయగలదు. ఇందులో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది.

ఇది నిద్రను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి వాసనను నేరుగా తీసుకోలేకపోతే, దాని రసాన్ని నీటిలో కలిపి తాగవచ్చు. ఇలా చేయడం వల్ల వెల్లుల్లి వాసన బాధించదు, ప్రయోజనాలు లభిస్తాయి. దీన్ని నిద్రకు ముందు తాగడం మంచిది. దీనికోసం ముందుగా ఒక చిన్న గిన్నెలో ఒక వెల్లుల్లి రెబ్బను వేడి చేయండి. తరువాత, ఒక గ్లాసు పాలు వేయండి. వేడి చేసి, రుచికి సరిపడా చక్కెర తేనె కలపండి. ఈ పాలను వేడిగా కాని, చల్లగా కాని తాగవచ్చు. ఇది మీకు ప్రశాంతమైన నిద్రను అందిస్తుంది. తప్పకుండా ఒకసారి ప్రయత్నించండి.



# అన్నదమ్ముల మధ్య ట్వీట్ వార్

**విజయవాడ :** విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఆయన సోదరుడు మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మధ్య మళ్లీ ట్వీట్ వార్ మొదలైంది. దాదాపు ఏడాది విరామం తర్వాత ఈ ఇద్దరు సోషల్ మీడియా వేదికగా పరస్పరం విమర్శలు చేసుకుంటుండగా, వారి సన్నిహితులు కూడా పరుష వ్యాఖ్యలతో కామెంట్లు పెడుతూ రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. ఎంపీ చిన్న అనుచరుల మధ్య అక్రమ సంపాదన విషయమై గొడవలు జరుగుతున్నాయని, ఓ వ్యక్తి చేతులపై యాసిడ్ తో దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ ఎంపీ నాని అనుచరుడు పెట్టిన వాట్సాప్ సందేశం తీవ్ర రచ్చకు దారితీసిందని చెబుతున్నారు. ఇదే వ్యవహారంపై జాతీయ మానవహక్కుల సంఘంతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు మాజీ ఎంపీ నాని.ఎంపీ చిన్ని, మాజీ ఎంపీ నాని సొంత అన్నదమ్ములే అయినప్పటికీ, రాజకీయంగా ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొందని అంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. కానీ, తమ్ముడు, ఎంపీ చిన్నిని టార్గెట్ చేస్తూ ఆయన సోషల్ మీడియాలో పెద్ద యుద్ధమే చేస్తున్నారని చెబుతున్నారు. అయితే ఏం అయిందో కానీ, నాని కొన్నాళ్లుగా సైలెంటు అయ్యారు. దాదాపు ఏడాది క్రితం ఎంపీ చిన్ని టార్గెట్ గా వరుస ట్వీట్ లు పెడుతూ తమ్ముడిని గుక్క తిప్పుకోనీయకుండా చేశారని అంటున్నారు. ఇదే సమయంలో ఎంపీ చిన్ని కూడా అదే స్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ ఇద్దరి మధ్య ఫైట్ తో విజయవాడ రాజకీయం వాడివేడిగా ఉండేది ఇక ఏడాదిగా ఇద్దరి మధ్య డైలాగ్ వార్ కు విరామం వచ్చిందని అంటున్నారు. ఇదే సమయంలో ఎంపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీ కేశినేని నాని అనుచరుడిపై ఎంపీ చిన్ని అనుచరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం మాజీ ఎంపీ అనుచరుడి నుంచి ఎంపీ చిన్ని అనుచరుడికి వాట్సాప్ లో ఓ సందేశం వచ్చినట్లు చెబుతున్నారు. అందులో రూ.27 కోట్ల అక్రమ లావాదేవీలకు సంబంధించి ఆరోపణలు చేయడంతోపాటు ఓ వ్యక్తిపై యాసిడ్ దాడి జరిగిందని, దీనికి సంబంధించి కొందరు వ్యక్తులు పరారీలో ఉన్నారని ఆ సందేశంలో పేర్కొన్నారు.”. ఈ విషయం ఎంపీ దృష్టికి వెళ్లడంతో వాట్సాప్ లో సందేశం పంపిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొన్నాళ్లుగా సైలెంటుగా ఉన్న మాజీ ఎంపీ నాని రంగంలోకి దిగారని చెబుతున్నారు. నా చిన్ననాటి స్నేహితుడిపై తప్పుడు ఆరోపణలతో క్రిమినల్ కేసులు పెడుతున్నారని, ముందస్తు సమాచారం లేకుండా ఆయన ఇంటిలో పోలీసులు తనఖీలు చేస్తున్నారని మండిపడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును ట్యాగ్ చేస్తూ జాతీయ మానవహక్కుల కమిషన్ కు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత మరో పోస్టు చేస్తూ ఎంపీ అక్రమ సంపాదనపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో స్పందించిన ఎంపీ చిన్న ఘాటుగా స్పందించారు. ‘కొందరు తమ జీవితాలను పుకార్లు సృష్టించడంలో ఇతరులను రెచ్చగొట్టడంలో ప్రతికూలతలను వ్యాప్తి చేయడంలో అవే అబద్దాలను పదేపదే చెప్పడంలో గడిపేస్తారు. నేను నా జీవితాన్ని నిర్మాణానికి సేవ చేయడానికి ఫలితాలను అందించడానికి విజయవాడను ముందుకు నడిపించడానికి కేటాయించాలని ఎంచుకున్నాను’ అంటూ ట్వీట్ చేశారు. ఇదే సమయంలో ఎంపీకి మద్దతుగా ఆయన అనుచరులు సైతం భారీగా ట్వీట్ చేశారు. అటు మాజీ ఎంపీ అనుచరులు సైతం అంతే దీటుగా స్పందించడంతో గురువారం రోజంతా ఇద్దరి మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు హోరెత్తాయి.

### జిల్లా అంతా ఇంతేనా

ఏపీలో అధికార తెలుగుదేశం పార్టీకి కృష్ణాజిల్లా తలనొప్పిగా మారుతోంది. తెలుగుదేశం పార్టీకి ఈ జిల్లా పెట్టని కోట. కానీ గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలతో టిడిపిలో ఒక రకమైన విభేదాలు కనిపిస్తున్నాయి. దానికి కారణం లేకపోలేదు. కొత్త, పాత నేతల మధ్య ఆధిపత్య పోరే కారణం. మొన్నటివరకు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని వర్సెస్ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నట్టు నడిచింది వ్యవహారం. ఇంకోవైపు మైలవరంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వర్సెస్ మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నట్టు ఉంది పరిస్థితి. మరోవైపు విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని వ్యవహారం కూడా తీవ్ర దమారం రేపు తోంది. నిత్యం ఆయన సోదరుడు కేశినేని నాని సంచలన ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయితే పరిస్థితి మాత్రం తెలుగుదేశం పార్టీలో అదుపుతప్పుతోందని అర్థం అవుతోంది.తిరువూరు ఎమ్మెల్యేగా ఉన్నారు కొలికపూడి శ్రీనివాసరావు. అమరావతి ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన శ్రీనివాసరావుకు మంచి పేరు ఉండేది. విద్యావేత్త కూడా. సబ్జెక్టు పై స్పష్టమైన అవగాహన ఉంది. కానీ ఆయన దూకుడుగా ఉంటారు. చాలా ఆవేశంగా మాట్లాడతారు. ఈ అంశం పైన అయినా వేగంగా స్పందిస్తారు. ఈ క్రమంలోనే ఆయన అత్యంత వివాదాస్పదుడు అయ్యారు. సొంత పార్టీ శ్రేణులు వ్యతిరేకించడంతో టీడీపీ హై కమాండ్ ఎంపీ కేసినేని చిన్నికి తిరువూరు బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి అక్కడ ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ అన్నట్టు పరిస్థితి మారిపోయింది. కేశినేని చిన్ని పై ఎమ్మెల్యే శ్రీనివాసరావు నిత్యం సంచలన ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. అయితే తిరువూరు ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు మాత్రం టిడిపి వెనుకడుగు వేస్తోంది.మరోవైపు మైలవరం నియోజకవర్గంలో కూడా తెలుగుదేశం పార్టీలో విభేదాలు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యేగా వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నారు. మొన్నటి ఎన్నికలకు ముందు ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపిలో చేరారు. అంతకుముందు ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన వసంత కృష్ణ ప్రసాద్ దేవినేని ఉమామహేశ్వరరావు పై గెలిచారు. అయితే వసంత కృష్ణ ప్రసాద్ రాకతో దేవినేని ఉమామహేశ్వరరావు సీటు త్యాగం చేయాల్సి వచ్చింది. అయితే గెలిచిన తర్వాత వసంత కృష్ణ ప్రసాద్ వర్గం దేవినేని ఉమామహేశ్వరరావు వర్గాన్ని అణచివేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా దేవినేని ఉమామహేశ్వరరావుకు ఇప్పటివరకు నామినేటెడ్ పదవి సైతం లభించలేదు. దీంతో ఆయన వర్గంలో సైతం తీవ్ర అసంతృప్తి ఉంది. అందుకే అక్కడ తరచూ విభేదాలు తలెత్తుతున్నాయి.మరోవైపు కేశినేని సోదరులు ఇద్దరు ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హీటెక్కిస్తున్నారు. మొన్నటి ఎన్నికలకు ముందు టిడిపికి గుడ్ బై చెప్పారు కేసినేని నాని. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సోదరుడు చిన్ని చేతిలో ఓడిపోయారు. అంతకుముందు రెండు ఎన్నికల్లో టిడిపి తరఫున గెలిచిన నాని పదేళ్లపాటు ఎంపీగా కొనసాగారు. అయితే టిడిపి నాయకత్వం పట్ల మంచి భావం ఉన్న స్థానిక పరిస్థితుల వల్ల ఆయన వైసీపీలోకి జంప్ చేయాల్సి వచ్చింది. అయితే ఈ పరిస్థితికి కారణం తన సోదరుడు చిన్ని అని రగిలిపోతున్నారు నాని. అందుకే టిడిపి నాయకత్వానికి దగ్గరయ్యే క్రమంలో సోదరుడు చిన్ని పై సంచలన ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. అయితే కృష్ణాజిల్లాలో జరుగుతున్న ఈ విభేదాలను చెక్ పెట్టాల్సిన అవసరం నాయకత్వంపై ఉంది. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ...

## - యాక్టివ్ అవుతున్న బూత్ లెవల్ కమిటీలు

**హైదరాబాద్,** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతోనే అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్ర అప్రమత్తమయ్యాయి. తమ సానుభూతిపరుల ఓట్లు ఎక్కడైనా గంపగుత్తగా తొలగిపోతాయేమోననే భయంతో అన్ని రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను రంగంలోకి దించాయి. ఎన్నికల సంఘం సాధారణంగా ప్రతి ఏటా ఓటర్ల జాబితా సవరణ చేపడుతుంది. కానీ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది చాలా ప్రత్యేకమైనది. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ అధికారులు నేరుగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, ఒకే ఓటరుకు రెండు మూడు చోట్ల ఉన్న డబుల్ ఓట్లను గుర్తించి జాబితా నుండి పూర్తిగా తొలగిస్తారు. అలాగే అర్హులైన కొత్త ఓటర్లను చేర్చుతారు.రాజకీయ పార్టీలకు ఈ ప్రక్రియ ఒక పెద్ద పరీక్ష లాంటిది. ఒక నియోజకవర్గంలో గెలుపోటములను కొన్ని వందల లేదా వేల ఓట్లు నిర్ణయిస్తుంటాయి. ఈ తీవ్రమైన ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో.. స్థానిక అధికారులు పొరపాటునో లేదా ఏకపక్షంగానో తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను వలస వెళ్లారు లేదా చిరునామా లేదు అనే నెపంతో తొలగిస్తే.. ఆ నష్టం పూడ్చలేనిది అవుతుంది. అందుకే ఓట్లు తగ్గిపోకూడదని, తమ క్యాడర్ ఓట్లు గల్లంతు కాకూడదని పార్టీలు విపరీతమైన టెన్షన్ పడుతుంటాయి.ఈ పరిస్థితిని తట్టుకోవడానికి ప్రతి పార్టీ తమ బూత్ లెవెల్ ఏజెంట్ల ను అప్రమత్తం చేస్తున్నాయి. ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారి ఇంటింటికీ తిరిగేటప్పుడు.. ఈ పార్టీ బీఎల్ఏలు కూడా వారితో పాటు తిరిగి, ఏ ఒక్క సానుభూతిపరుడి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపలా కాస్తారు. ఒకవేళ ప్రతిపక్ష ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులుంటే చనిపోయిన వారివి, డబుల్ ఓట్లు వాటిని తొలగించాలంటూ ఫామ్-7 ద్వారా అధికారులపై ఒత్తిడి తెస్తుంటారు. డిజిటల్ డేటా ద్వారా ఈ ప్రక్రియను పార్టీల ఐటీ విభాగాలు కూడా నిశితంగా గమనిస్తున్నాయి.సాంకేతికంగా ఓటు పోతే మళ్లీ చేర్పించుకోవడానికి ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. కానీ, ప్రాక్టికల్‌గా అది చాలా కష్టతరమైన ప్రక్రియ. ఒకసారి ఇంటెన్సివ్ రివిజన్ పూర్తయి, ఫైనల్ రోల్ విడుదలయ్యాక.. మళ్లీ ఓటు చేర్పించాలంటే సదరు ఓటరు వ్యక్తిగతంగా ఆసక్తి చూపించాలి. సాధారణంగా సాధారణ ఓటర్లు అంత శ్రద్ధ తీసుకోరు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి వేలాది మంది ఓట్లు పోయాయని గ్రహించినా.. అప్పటికప్పుడు లక్షలాది ఓట్లను తిరిగి చేర్పించడం ఏ రాజకీయ పార్టీకైనా అసాధ్యమైన టాస్క్. అందుకే నివారణే మేలు అన్నట్లు ముందే అలర్ట్ అవుతారు.ఇక్కడ అసలు ట్విస్ట్ ఉంది. సిద్ధాంతపరంగా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కావాలని అన్ని పార్టీలు పైకి చెప్తాయి. కానీ, క్షేత్రస్థాయి ప్రాక్టికల్ రాజకీయాల్లో ఏ పార్టీకి కూడా వంద శాతం క్లీన్ లిస్ట్ ఇష్టం ఉండదు. ఎందుకంటే, ప్రతి నియోజకవర్గంలోనూ దొంగ ఓట్లు , డబుల్ ఓట్లు లేదా చనిపోయిన వారి ఓట్లు తమకు అనుకూలంగా పోల్ అవుతాయని స్థానిక లీడర్లు నమ్ముతారు. తమకు అనుకూలమైన దొంగ ఓట్లను కాపాడుకుంటూ.. ప్రత్యర్థి పార్టీకి చెందిన నకిలీ ఓట్లను తొలగించాలనే ద్వంద్వ నీతి ని అన్ని పార్టీలు అవలంబిస్తుంటాయి. ఓటర్ల జాబితా అనేది ప్రజాస్వామ్యానికి పునాది. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఎన్నికల సంఘం నకిలీ ఓట్లకు గండి కొట్టాలని చూస్తుంటే.. రాజకీయ పార్టీలు మాత్రం తమ ఓటు బ్యాంకు చెదరకుండా చూసుకునే వ్యూహాల్లో మునిగిపోయాయి. ఈ ప్రక్రియ ముగిసేసరికి ఏ పార్టీ తన బూత్ స్థాయి యంత్రాంగాన్ని సమర్థవంతంగా వాడుకుంటుందో.. ఆ పార్టీ రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా ముందంజలో ఉంటుంది.

# లైన్‌లో పెద్దిరెడ్డి ఉన్నారా

**తిరుపతి,** వైసీపీ నాయకులు.. చాలా మందిపై కూటమి ప్రభుత్వం వచ్చాక కేసులు నమోదైన విషయం తెలిసిందే. మద్యం కుంభకోణంలో 3500 కోట్ల రూపాయల మేరకు బొక్కేశారన్న కేసు ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. జగన్ అప్పటి పీఎ.. కె, నాగేశ్వరరావుపై ప్రస్తుతం దృష్టిపెట్టారు. ఇక, అప్పట్లోనే జరిగిన మరిన్ని వివాదాలు.. హత్యలు.. శవం డోర్ డెలివరీ కేసులు.. నాయకులను వెంటాడుతున్నాయి. ఈ పరంపరలో ఇప్పుడు.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంతు వచ్చింది వైసీపీ హయాంలో పంచాయతీ, అటవీశాఖ మంత్రిగా పెద్దిరెడ్డి వ్యవహరించారు. ఆ సమయంలో కేంద్ర నిధులతో పంచాయతీల్లో రహదారులువేసే పనులు చేపట్టారు. ఇవి రాష్ట్ర వ్యాప్తంగాసాగాయి.

ఆయా జిల్లాలో వైసీపీకి చెందిన వారు కాంట్రాక్టులు దక్కించుకున్నారన్నది తెలిసిందే. అయితే.. ఇప్పుడు కేంద్రం నుంచి పనుల నాణ్యతపై సందేహాలు వచ్చాయి. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో రహదారులు పాడయ్యాయని.. ప్రస్తుతం పంచాయతీ రాజ్ అధికారులు కేంద్రానికి లేఖలుపంపారు.అయితే... తాము నిధులు ఇచ్చి, ఆయా పనులు చేపట్టి .. కేవలం నాలు గేళు కూడా కాకుండానే ఎందుకు పాడయ్యాయని.. వీటిపై విచారణ చేయాలని కేంద్రం నుంచి రాష్ట్రానికి తాఖీదు అందింది.

దీంతో పెద్దిరెడ్డి జమానాలో చేపట్టిన రహదారుల నిర్మాణం. ముఖ్యంగా ఆయన సొంత నిర్మాణ సంస్థ పీఎల్ఆర్ దక్కించుకున్న కాంట్రాక్టులు.. చేపట్టిన పనులు వంటివాటిపై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టారు. ఈ మొత్తం వ్యవహారంలో 500 కోట్లరూపాయల మేరకు.. నిధులు సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు వున్నాయి అప్పట్లో వీరిద్దరూ విడిపోవడానికి గల కారణాలపై ఎన్నో ఊహాగానాలు చెలరేగగా, దాదాపు నాలుగేళ్ల తర్వాత లలిత్ మోదీ తమ బ్రేకప్ వెనుక ఉన్న అసలు నిజాన్ని బహిరంగంగా వెల్లడించారు. తన సొంత జిల్లా చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి సంస్థ చేపట్టిన పనులు నాసిరకంగా ఉండడం.. ఇక్కడి రహదారులు రెండేళ్లకే ధ్వంసం కావడంతో ఆయా పనులపై విచారణ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీనిలో అవకతవకలు భారీగానే జరిగాయని విజిలెన్స్ అదికారులు భావిస్తున్నారు. దీనికితోడు కాంట్రాక్టర్ల ను కూడా బెదిరించి.. పీఎల్ ఆర్ సంస్థకే అన్ని పనులు కట్టబెట్టారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పెద్దిరెడ్డిపై చర్యలు ఖాయమని.. నిజాలు నిగ్గుతేలుతాయని చిత్తూరు రాజకీయ వర్గాలు అంటున్నాయి. కాగా.. గత ఏడాది అటవీ భూములు ఆక్రమించుకున్నారని.. పవన్ కల్యాణ్ విమర్శలు చేసినప్పటికీ.. వాటిపైచర్యలు ఏమయ్యాయో.. ఇప్పటికీ అంతుచిక్కడం లేదు.

# పెమ్మసాని ఔట్...

**గుంటూరు,** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో మంత్రి నారాయణ మాత్రమే అంతా చూసుకుంటారు. ఆయన పర్యవేక్షణలోనే పనులు జరగాలి. మంత్రి నారాయణ కూడా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులను ఆదేశిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాత్రం ఇక్కడ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది.

పెమ్మసాని తప్పుకున్నారా?. తప్పించారా? అన్న చర్చ టీడీపీ వర్గాల్లోనే జరుగుతుంది. అమరావతి రాజధాని లో రైతుల నుంచి భూమిని సేకరించాలంటే కేంద్ర మంత్రి పెమ్మసాని వచ్చి రైతులకు కొంత నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయితే నారాయణ మాత్రం పెమ్మసాని జోక్యాన్ని పెద్దగా ఇష్టపడటం లేదని తెలిసింది. ఈ విషయాన్ని గ్రహించిన నాయకత్వం పెమ్మసానికి ఏవైనా పరోక్షంగా ఆదేశాలిచ్చిందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి.2014లోనూ మంత్రి నారాయణ అంతా తానే అయి అమరావతి పనులను చూశారు. నాడు రాష్ట్రమంత్రి పత్తిపాటి పుల్లారావు కూడా తోడుగా ఉన్నారు. మరొక విషయం ఏంటంటే...మంత్రి నారాయణపై చంద్రబాబు, లోకేశ్ పై అపార నమ్మకం ఉంది. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా పూర్తి చేస్తారన్న విశ్వాసం ఉంది. మంత్రి నారాయణకు, చంద్రబాబు కుటుంబానికి సంబంధం ఈనాటిది కాదు. కొన్ని దశాబ్దాలుగా వారి మధ్య నమ్మకమైన మైత్రి నడుస్తుంది. అయితే అమరావతి రాజధాని నిర్మాణంలో మరొకరు క్రెడిట్ కొట్టేయడానికి మంత్రి నారాయణ ఇష్టపడటం లేదని తెలిసింది. మంచైనా, చెడైనా తానే చూసుకుంటానన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

చంద్రబాబు, లోకేశ్ లు కూడా రాజధాని అమరావతి పనుల విషయంలో మంత్రి నారాయణకే పూర్తి బాధ్యతలను అప్పగించారు. అలాగే ఏ విషయం ఉన్నా నారాయణతోనే చర్చిస్తున్నారు. అందుకే అమరావతి రాజధాని పనుల పర్యవేక్షణ, భాద్యతలనుండి నుంచి, కేందమంత్రి పెమ్మసాని తెలివిగా తప్పుకున్నారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. అధికారులు కూడా మంత్రి నారాయణ మాటకు మాత్రమే విలువ ఇస్తుండటంతో ఇక తన అవసరం ఇక్కడ లేదని పెమ్మసాని చంద్రశేఖర్ తనంతట తానుగానే అమరావతి పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పుకున్నారన్న చర్చ టీడీపీ వర్గాల్లోనూ నడుస్తుంది. అందుకే అమరావతి రాజధాని ప్రాంతాలలో కేంద్ర మంత్రి పెమ్మసాని హడావుడి పూర్తిగా కన్పించడం మాయమైందంటున్నారు. మరి ఇందులో నిజానిజాలు మాత్రం తెలియదు. ప్రచారం మాత్రం ఇలాగే జరుగుతుంది.

# పాపం..దీదీ...

## నిట్టనిలువునా చీలనున్న పార్టీ

**కోల్ కత్తా** రాజకీయాల్లో సొంతవాళ్ల తిరుగుబాటును ఎదుర్కోవడం ప్రత్యర్థులను ఎదుర్కోవడంకన్నా కష్టం. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి పదవిని కోల్పోయిన మమతా బెనర్జీ ప్రస్తుతం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు.

మూడు దశాబ్దాలుగా బెంగాల్ రాజకీయాల్లో అప్రతిహత శక్తిగా నిలిచిన ఆమెకు ఈసారి సవాలు సొంత పార్టీ నుంచే వస్తోంది. ఏకంగా పార్టీని నిట్టనిలువునా చీల్చేంతగా పెరుగుతోంది.ఇప్పటివరకు మమతా బెనర్జీ ఎదుర్కొన్న ప్రతి రాజకీయ సంక్షోభంలో ప్రత్యర్థి స్పష్టం. ఒకప్పుడు కమ్యూనిస్టులు, తర్వాత బీజేపీ. కానీ ఇప్పుడు ఆమె ఎదుట నిలబడిన వారు ఆమె స్వయంగా పెంచి పోషించిన నాయకులే. అందుకే 2026 సంక్షోభం మమత రాజకీయ జీవితంలో ఎదుర్కోబోయే అతిపెద్ద సవాలు కానుంది. మమతా బెనర్జీ రాజకీయ జీవితం భారత రాజకీయాల్లో అరుదైన కథ. కోల్‌కతాలోని సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఆమెకు రాజకీయ వారసత్వం లేదు. ఆర్థిక బలం లేదు. ఉన్నదల్లా అసాధారణమైన పోరాట పటిమ మాత్రమే.కాంగ్రెస్ విద్యార్థి విభాగంలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మమత, ఓ దశలో ఆపార్టీ సీనియర్లతోనే విభేదించి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఆ గొడవలో మమతపై భౌతిక దాడికూడా జరిగింది. కానీ దేనికీ వెరవకుండా కాంగ్రెస్ కి ప్రత్యామ్నాయంగా ఎదిగారు. ప్రత్యక్ష ఉద్యమాలకు ప్రతీకగా మారారు. కమ్యూనిస్టు పాలనకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.1998లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పుడు చాలామంది ఆమెను తేలిగ్గా తీసిపారేశారు.

ప్రతిపక్షమంటే కాంగ్రెస్ కాదు తృణమూల్ కాంగ్రెస్ అనేలా ఎదిగారు . చివరికి 2011లో 34 ఏళ్ల కమ్యూనిస్టు పాలనకు ముగింపు పలికి చరిత్ర సృష్టించారు. అది కేవలం అధికార మార్పు కాదు. బెంగాల్ రాజకీయాల్లో ఓ సంచలన పరిణామం.మమత విజయానికి ప్రధాన కారణం ఆమె వ్యక్తిత్వం. కన్యాశ్రీ, విద్యార్థి స్కాలర్‌షిప్‌లు, ఆరోగ్య పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో ఆమెపై ప్రత్యేకమైన అనుబంధాన్ని సృష్టించాయి. ప్రజలు తృణమూల్ కాంగ్రెస్‌ను కాకుండా “దీదీ”ని విశ్వసించారు. అదే సమయంలో పార్టీ నిర్మాణం కూడా మమత చుట్టూనే తిరిగింది. నిర్ణయాలు, వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, రాజకీయ దిశ?అన్నీ దీదీ నే కేంద్రంగా పనిచేసాయి.ఈ విధానం అధికారంలో ఉన్నప్పుడు పార్టీకి బలంగా పనిచేసింది. ఇప్పుడు ఆమె నాయకత్వానకీ, నిర్ణయాధికారానకీ అదే సవాలుగా మారింది. వారసుడు అభిషేక్ బెనర్జీకి శాపంగా మారింది. మమత రాజకీయ జీవితంలో సంక్షోభాలు కొత్తవి కావు. విధ్యార్థినాయకురాలిగా రాజకీయ ప్రవేశం చేసినప్పటినుంచీ ప్రతీ స్థాయిలోనూ ఇదే ఆమెకు చివరి ఘట్టం అన్నంత పెద్ద సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతీ సారీ ధైర్యగా ఎదుర్కొన్నారు. ప్రతీ సారీ మరో మెట్టు ఎదిగారు. సింగూర్ ? నందిగ్రామ్ ఉద్యమాల సమయంలో మమత మరీ పెట్టుబడులకు వ్యతిరేకంగాపోతున్నారు. కమ్యూనిస్టులే పరిశ్రమలను ప్రోత్సహిస్తుంటే భూములు, నిర్వాసితులు అనే నినాదం పనిచేయదు .. వ్యతిరేకత వస్తుందన్నారు.

కానీ ఆపోరాటంతోనే కమ్యూనిస్టులను మట్టికరిపించారు. నందిగ్రామ్ పరాజయం ? 2021 : తన రాజకీయ ప్రతిష్టకు ప్రతీకగా మారిన నందిగ్రామ్‌లో సువేందు అధికారికి ఓడిపోయినప్పుడు మమత రాజకీయంగా బలహీనపడతారని విశ్లేషణలు వచ్చాయి. కానీ అదే ఎన్నికల్లో తృణమూల్ 200కు పైగా స్థానాలు గెలుచుకుని అధికారాన్ని నిలబెట్టుకుంది. ఓటమిని విజయంగా మార్చుకోవడంలో మమత మరోసారి సత్తా చాటారు.ఆర్జీ ఖర్ ఆస్పత్రి ఘటన : 2024లో జరిగిన వైద్య విద్యార్థిని హత్య కేసు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది. భారీ నిరసనలు జరిగాయి. అయినప్పటికీ మమత రాజకీయంగా నిలబడగలిగారు. అందుకే ఆమె రాజకీయ ప్రస్థానాని దగ్గరగాచూసిన వాళ్లు చెబుతారు.. సవాళ్లంటే మమతకు మరో మెట్టు అని.ఈసారి మమత ఎదుర్కొంటున్న సమస్య బయట శత్రువు కాదు.. పార్టీలో అంతర్గతంగా ఉన్న వ్యక్తులే.. గతంలో సువేందు అధికారి తనను ఎదిరించిప్పుడు, బీజేపీ 2021లోనే తన రాజకీయ పతనానికి అన్ని యత్నాలూ చేసినప్పుడు ఎదురొడ్డి నిలిచారు.

కానీ ఈసారి సమస్య అత్యంత పెద్దది. పార్టీ ఎమ్మెల్యేలలో దాదాపు 60 మంది తిరుగుబాటు చేయడం బెంగాల్ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఏకంగా పార్టీ మొత్తాన్నే చీల్చేంతగా.. అసలు పార్టీనే మాది అనేంత పెద్దది. ఇది కేవలం నాయకత్వంపై అసంతృప్తి మాత్రమే కాదు. ఇది పార్టీ భవిష్యత్తుపై అనిశ్చితి. ఏడు పదులు దాటిన ఓ రాజకీయ యోధురాలి పోరాట పఠిమకు మరో పరీక్ష.

### మరి ఈసారి తట్టుకుని నిలబడగలదా ?

బెంగాల్ రాజకీయాల్లో భావోద్వేగాలు, ప్రాంతీయ భావం, వ్యక్తిత్వ రాజకీయాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ మూడు అంశాల్లోనూ మమత ఇప్పటికీ తిరుగులేని నాయకురాలే. బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో అసంతృప్తిని కలిగించే నిర్ణయాలు తీసుకుంటే, ప్రతిపక్ష నాయకురాలిగా మమతకు మళ్లీ అవకాశాలు రావచ్చు. మైనారిటీల మద్దతు ఎప్పటికీ మమతకే అదే సమయంలో వయసు, పార్టీ విభేదాలు, అవినీతి ఆరోపణలు, నాయకత్వంపై ప్రశ్నలు ఆమెకు ప్రతికూలంగా మారే అవకాశం కూడా ఉందిఅందుకే బెంగాల్ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరి మదిలో ఒకే ప్రశ్న వినిపిస్తోంది? ఇది దీదీ రాజకీయ ప్రస్థానానికి అస్తమయమా? లేక మరోసారి ఆమె పునరాగమనానికి ముందు నిశ్శబ్దమా?

# ఆశలు రేపుతున్న చంద్రయాన్ రిపోర్ట్

**బెంగళూరు,** చంద్రయాన్-2 ల్యాండర్ ఫెయిల్ అయిందని ఒకప్పుడు నిరాశపడిన వారికి, అలాగే అంతరిక్ష రేసులో పోటీపడుతున్న ప్రపంచ దేశాలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ( మైండ్ బ్లాంక్ అయ్యే న్యూస్ చెప్పింది. ల్యాండర్ క్రాష్ అయినా, గత ఏడేళ్లుగా చంద్రుడి చుట్టూ సైలెంట్‌గా తిరుగుతున్న ‘చంద్రయాన్-2 ఆర్బిటార్’ ఇప్పుడు ఒక సంచలన విషయాన్ని కనిపెట్టింది. సౌర కుటుంబంలోనే అత్యంత రహస్యమైన, సూర్యరశ్మి అస్సలు పడక మైనస్ 248 డిగ్రీల గడ్డకట్టే చలి ఉండే చంద్రుని దక్షిణ ధ్రువంలో భారీగా మంచు నిల్వలు ఉన్నట్లు పక్కా ఆధారాలతో కనిపెట్టింది.అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు ఆర్బిటార్ పంపిన డేటాను లోతుగా విశ్లేషించి ఈ నిజాన్ని ప్రపంచం ముందుంచారు. చంద్రయాన్-2 ఆర్బిటార్‌లోని ‘డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్’ ఈ అద్భుతాన్ని సుసాధ్యం చేసింది. ఎల్-బ్యాండ్, ఎస్-బ్యాండ్ ఫ్రీక్వెన్సీలలో పనిచేసే ఈ అత్యాధునిక పరికరం చంద్రుడి ఉపరితలం కింది భాగంలోకి మైక్రోవేవ్ సంకేతాలను పంపి చీకటి గుట్టును రట్టు చేసింది. సాధారణ రాళ్లు, దుమ్ము కంటే మంచు ఈ రాడార్ సంకేతాలను భిన్నంగా వెనక్కి (పరావర్తనం) పంపుతుంది.

దీని ఆధారంగా దక్షిణ ధ్రువంలోని డబ్లీ షాడోడ్ క్రేటర్ల కింద బిలియన్ల సంవత్సరాల నాటి మంచు ఉన్నట్లు స్పష్టమైంది.శాస్త్రవేత్తలు పరిశోధించిన తొమ్మిది భారీ గుంతలలో.. ‘ఫాస్టిని క్రేటర్’ లోపల ఉన్న 1.1 కిలోమీటర్ల వ్యాసం గల ఒక చిన్న గుంతలో ఈ మంచుకు సంబంధించిన అత్యంత బలమైన ఆధారాలు లభించాయి. అయితే ఈ మంచు నేరుగా చంద్రుడి (ఓనీని) ఉపరితలంపై లేదు. భవిష్యత్తులో వ్యోమగాములు సులభంగా సేకరించడానికి వీల్లేకుండా, లోపల భూగర్భంలో భద్రంగా దాగి ఉంది. కోట్ల ఏళ్ల క్రితం ఒక ఉల్క చంద్రుడిని బలంగా ఢీకొట్టినప్పుడు, లోపల ఉన్న మంచు నిల్వలు ద్రవరూపంలోకి మారి పక్కకు ప్రవహించి, మళ్లీ అక్కడే గడ్డకట్టుకుపోయినట్లుగా ఉన్న ప్రత్యేక ఆకారాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు.భూమి మీద నుంచి అంతరిక్షంలోకి నీటిని, ఇంధనాన్ని మోసుకెళ్లడం అత్యంత ఖర్చుతో కూడుకున్న పని.

కానీ ఇప్పుడు చంద్రుడిపై (ఓనీని) దొరికిన ఈ మంచును రసాయన ప్రక్రియల ద్వారా స్వచ్ఛమైన తాగునీరుగా, వ్యోమగాములు పీల్చుకునే ఆక్సిజన్‌గా, చివరికి రాకెట్ ఇంధనంగా కూడా మార్చుకోవచ్చు! ఈ అద్భుతమైన అవకాశం వల్లే ఇప్పుడు అమెరికా నాసా (ఔయాం) ఆర్టెమిస్ ప్రోగ్రామ్, చైనా లూనార్ మిషన్లు అన్నీ కూడా చంద్రుని దక్షిణ ధ్రువంపైనే కన్నేశాయి.కానీ ఆ అగ్రరాజ్యాల కంటే ముందే అక్కడి అణువణువు రహస్యాలను ఇస్రో పసిగట్టి ప్రపంచ అంతరిక్ష రేసులో తన సత్తా చాటింది. 2023లో చంద్రయాన్-3 సృష్టించిన చారిత్రక (ఓనీని) ల్యాండింగ్ విజయానికి, ఇప్పుడు చంద్రయాన్-2 ఆర్బిటార్ అందిస్తున్న ఈ డేటా తోడవడంతో గ్లోబల్ స్పేస్ సెక్టార్‌లో భారతదేశం తిరుగులేని శక్తిగా అవతరించిందని విశ్లేషకులు అంటున్నారు.

# ఆగని జాగీర్ లొల్లి..

**హైదరాబాద్,** చిలికి చిలికి గాలివానలా మారిందన్న మాటకు తగ్గట్లే ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు మొదలయ్యాయి.తాజాగా తెలంగాణ సెంటిమెంట్ ను పెద్ద ఎత్తున రాజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే పలు రాజకీయ పార్టీలు ఎవరికి వారు గళాన్ని విప్పుతున్నారు.

ఈ సందర్భంలోనే జనసేన గచ్చిబౌలిలో రెండు వేల మందితో సభను నిర్వహించాలని భావించిన జనసేనాని అందుకు తగ్గట్లే పోలీసు పర్మిషన్ కోసం ప్రయత్నించటం.. అందుకు పోలీసులు నో చెప్పటం తెలిసిందే. కోర్టు సైతం సానుకూలంగా స్పందించని నేపథ్యంలో.. తన ఇంటి వద్దే మీడియా భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎవరబ్బ జాగీర్ కాదంటూ గళం విప్పారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మిస్టర్ పవన్ కల్యాణ్.. తెలంగాణ తమ జాగీర్ అని.. ఇంకెవరిది కాదని తేల్చేశారు. పవన్ నోటి నుంచి వచ్చిన జాగీర్ మాటపై అభ్యంతరం వ్యక్తం చేయటం తెలిసిందే. తాజాగా బీఆర్ఎస్ ముఖ్యనేత కేటీఆర్ సైతం పవన్ వ్యాఖ్యల్ని వ్యతిరేకించారు. ఇదంతా ఒకే అనుకునే వేళలో.. కొన్ని సందేహాలు తెర మీదకు వచ్చాయి. బరాబర్.. తెలంగాణ ఎవరి జాగీర్ అనే దానికి తెలంగాణ నేపథ్యం ఉన్న నాలుగున్నర కోట్ల మందిది తెలంగాణ జాగీర్ గా పేర్కొన్నారు. అంటే.. తెలంగాణ అన్నది తెలంగాణ నేటివ్ వాళ్లదే అనే వాదనను ప్రశ్నించాల్సిన అవసరం లేదు. కాకుంటే.. ఒకే ఒక్క సమస్య తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణను వ్యతిరేకించిన గళాలు ఉండనే ఉన్నాయి. మరి.. వారిది కూడా తెలంగాణ జాగీరేనా? అన్నది ప్రశ్న. ఎందుకంటే..తెలంగాణ ఉద్యమ సమయంలో కొత్త రాష్ట్ర ఏర్పాటును సుతారం ఒప్పుకోకపోవటమే కాదు.. వ్యతిరేకిస్తూ ఓపెన్ గా మాట్లాడేసిన సీపీఎంతో పాటు మజ్లిస్ పార్టీల సంగతేంటి? ఆ పార్టీల అధినేతలు.. కీలకనేతలు.. కార్యకర్తలు.. ఇతరులు అందరూ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారే కదా? సీపీఎం గురించి మళ్లీ ప్రస్తావించాల్సిన అవసరం లేదు.

# ముఖ్యమంత్రి సాబ్ నాకు పెన్షన్ ఇవ్వండి

- ఆరేళ్లుగా వీల్‌చైర్‌కే పరిమితం.. అయిన కరగని పాలకుల హృదయాలు
- రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతిని నడవలేని స్థితిలో శేఖర్
- పెన్షన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం

**ఆయన రెక్కల కష్టంతో బతకాల్సిన ఒక సామాన్యుడు. కానీ, విధి ఆడిన వింత నాటకంలో ఆరు సంవత్సరాల క్రితం జరిగిన ఒక రోడ్డు ప్రమాదం అతని జీవితాన్ని తలకిందులు చేసింది. ప్రమాదంలో వెన్నుపూస పూర్తిగా దెబ్బతినడంతో నడవలేని స్థితికి చేరుకుని, గత ఆరేళ్లుగా వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. అంతటి అభాగ్యుడికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం, అధికారులు మాత్రం దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు మైసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెయ్యల శేఖర్ అనే వికలాంగుడి దయనీయ గాధ ఇది.**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రోడ్డు ప్రమాదం తర్వాత బతుకు భారంగా మారడంతో, తనకు వచ్చే వికలాంగుల పెన్షన్ (ఆసరా) ద్వారా జీవితాన్ని వెళ్లదీయవచ్చని శేఖర్ భావించాడు. అందుకోసం గత ఆరు సంవత్సరాలుగా అతను చేయని ప్రయత్నం లేదు, తిరగని ఆఫీసు లేదు. స్థానిక అధికారుల నుంచి మొదలుకొని ప్రజాప్రతినిధుల వరకు అందరినీ ఆశ్రయించాడు. ఎమ్మెల్యే మల్లారెడ్డిని, ప్రస్తుత కౌన్సిలర్‌ను, మాజీ సర్పంచ్‌ను, అలాగే అధికారులను పదుల సార్లు కలిసి నా బాధను చెప్పుకున్నాను. అందరూ వస్తది, ఇస్తాం అని మాటలు చెప్పారే తప్ప ఇంతవరకు నాకు పెన్షన్ మంజూరు కాలేదని శేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### అర్హుడికి అందని సాయం..

అన్ని అర్హతలు ఉండి, వీల్‌చైర్‌కే పరిమితమైన ఒక వికలాంగుడికి ఆరేళ్లుగా పెన్షన్ రాకపోవడంపై స్థానికులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కేవలం ఓట్ల కోసమే వస్తారని, ఇలాంటి ఆపద కాలంలో పేదలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడుతున్నారు. నిత్యం మంచానికే పరిమితమైన శేఖర్ కుటుంబం, అతని వైద్య ఖర్చులు మరియు పోషణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

### ముఖ్యమంత్రి గారూ.. నన్ను ఆదుకోండి..

పాలకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన పెయ్యల శేఖర్.. ఇప్పుడు ఆఖరి ఆశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైపు చూస్తున్నాడు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి, మానవతా దృక్పథంతో తనకు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని, తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని శేఖర్ కన్నీటితో వేడుకుంటున్నాడు.



## ప్రతిభా పురస్కారం అందుకున్న గజ్వేల్ విద్యార్థిని లలితావాణి




గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరేందర్ స్రవంతి దంపతుల కుమార్తె లలితా వాణి పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరచి పురస్కారం అందుకున్నారు ఆదివారం సిద్దిపేట పట్టణ కేంద్రంలో సిద్దిపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి ఇంటర్మీడియట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు అందులో భాగంగా గజ్వేల్ కు చెందిన విద్యార్థిని లలితవాణి ఉత్తమ పురస్కారం అందుకున్నారు ఈ సందర్భంగా సిద్దిపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కైలాసం విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వాసవి ఫౌండేషన్ చైర్మన్ కొమురవెల్లి శివకుమార్ ప్రధాన వక్త డాక్టర్ వీరేందర్ శ్యాంసుందర్ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, చందా నాగభూషణం శోభారాణి దంపతులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## 491 వడ్ల బస్తాలతో పరారైన డీసీఎం డ్రైవర్ అరెస్ట్

- రాజస్థాన్‌లో వాహనం గుర్తించి స్వాధీనం చేసుకున్న గౌరారం పోలీసులు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా కుకునూరు పల్లి మండలం తిప్పారం గ్రామానికి చెందిన రైతుల 491 వరి ధాన్యం బస్తాలతో పరారైన డీసీఎం వాహనాన్ని రాజస్థాన్‌లో గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పారం గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతుల 491 వరి ధాన్యం బస్తాలను ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జి ప్రభుత్వ ఆదేశాల మేరకు రవాణా శాఖ, కుకునూరుపల్లి పోలీసుల సహకారంతో రాజస్థాన్‌కు చెందిన డీసీఎం వాహనంలో లోడ్ చేసి వర్గల్ మండలంలోని ఓ రైస్‌మిల్లుకు తరలించారు. రైస్‌మిల్ యాజమాన్యం వాహనాన్ని పార్కింగ్‌లో ఉంచాలని సూచించడంతో రైతులు మరుసటి రోజు వస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న డీసీఎం డ్రైవర్, పార్కింగ్‌లో ఉన్న వడ్ల బస్తాలతో కూడిన వాహనాన్ని దొంగతనంగా తీసుకుని రాజస్థాన్‌కు పారిపోయాడు. దీంతో రైతులు, ఐకేపీ సూపర్వైజర్ గౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏసీపీ నర్సింలు పర్యవేక్షణలో గౌరారం, కుకునూరుపల్లి పోలీసుల ప్రత్యేక బృందాలు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దర్యాప్తు చేపట్టాయి. స్థానిక పోలీసుల సహకారంతో రాజస్థాన్‌లో డీసీఎం వాహనం ఆచూకీని గుర్తించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని గౌరారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దొంగతనం చేయడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అకాల వర్షాలు, కొనుగోలు కేంద్రాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ ఘటన మరింత ఆందోళన కలిగించిందన్నారు. అయితే తమ ధాన్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రవిరాజ్ మాట్లాడుతూ ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే సమయంలో రైతులు వాహనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లోడుతో ఉన్న వాహనాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కేసును ఛేదించిన గౌరారం, కుకునూరుపల్లి పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

## అనుమతులు లేకున్నా కాలనీ లో వెలుస్తున్న కార్పొరేట్ కళాశాలలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హబ్సిగూడ లోని స్ట్రీట్ నెంబర్ 3 లో కాలనీ మధ్యలో అనుమతులు లేకున్నా నడిపిస్తున్న కార్పొరేట్ కళాశాలను కాలనీ వాసులు కాలేజీ ముందు నిరసన వ్యక్తపరిచారు. తమ కాలనీ లో కళాశాలను ఏర్పాటు చేయటం తో ట్రాఫిక్ సమస్యలతో పాటు రోజు పిల్లల గొడవలు గోలలతో తమ ప్రశాంతతకు భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్పొరేట్ కళాశాలకు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆంతే కాకుండా ఇక్కడ కళాశాల ఏర్పాటును కాలనీ వాసులు కోర్టు నుండి స్టే ఆర్డర్ తెచ్చుకున్న కళాశాల యాజమాన్యం, ప్రభుత్వ ఉద్యోగులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ధ్వజమెత్తారు. ప్రశాంతంగా ఉండే కాకతీయ నగరులో వాహనాల రాకపోకలు పెరిగి వాహన ధ్వనులతో ఉదయం మధ్యాన్నం మారుమోగుతోంది తెలిపారు. ఇదంతా చూస్తూ కాలనీ పాలక వర్గం తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరించటం తో అనుమానాలను రేకెత్తించే విధంగా ఉందని తెలియజేసారు. కాలనీ పాలక వర్గ విభేదాలను కూడా ఈ కళాశాల యాజమాన్యం తమకు అనువుగా ఉన్నవారితో కలసి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారనే అనుమానాలను వ్యక్త పరుస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు ఈ విషయం లో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలనీ కాలనీ వాసుల డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలో బొమ్మగౌని రఘుపతి గౌడ్, మనీష్ రెడ్డి నరోత్తం రెడ్డి బాబురావు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉత్కంఠభరిత ఎన్నికల్లో బొగ్గుల సురేష్‌కు అయ్యప్ప భక్తుల మద్దతు



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నూతన పాలకవర్గ ఎన్నికలు ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌పై బొగ్గుల సురేష్ ఘన విజయం సాధించి నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా జగ్గయ్యగారి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా అయిత సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా తూమ్ గోపి, కోశాధికారిగా నారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కమిటీ సభ్యులను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, 2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ అయ్యప్ప స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఆలయ శాశ్వత సభ్యులు, భక్తులను కలుపుకొని ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు బొగ్గుల సురేష్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయ సేవలో, అభివృద్ధిలో నూతన కార్యవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అపహరించబడ్డ రాముడు



**అలనాటి కథల్లోని కోదండరాముడు**
**చెడును చీల్చేయడానికి విల్లెక్కుపెడితే**
**నేడు మతోన్మాదులచే చెరబడ్డ కౌసల్యరాముడు**
**మసీదులపై మత విద్వేషపు విల్లెక్కుపెడుతున్నాడు**
**భక్తి భజనలతో పరవశించి నలుదిక్కులు ధ్వనించిన నాటి శ్రీరాముని నామం**
**నేడు చంపేస్తాం మొక్కమంటూ బాధించి బయటపెట్టి బలవంతంగా చర్చిలలో**
**చొరబడుతోంది**

**ఆనాటి అయోధ్య రాముడు రాజ్య సమృద్ధికి**
**రాజ కిరీటం ధరిస్తే**
**నేటి అధికార వ్యామోహపు అరచేతికి చిక్కిన రఘురాముడు**
**అభివృధి రహిత భారతానికి అన్నింటా అడ్డు పెట్టుకునే భూటకపు గుడిగోడల మధ్య**
**అలంకరించబడ్డాడు**

**అలనాటి గాథల్లో మంచి బాలునిగా కీర్తించబడ్డ సీతారాముడు**
**నేటి ఆదర్శ హిందువుల స్పృహలేనితనానికి రాబోయే తరాలకు**
**రాజకీయ రౌడీలచే నవ భారత రాక్షసుడిగా రూపుమారబోతున్నాడు.**
**తస్మాత్ జాగ్రత్త**

**మీ నేపా సంతోష్ అచ్యుత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్,**
**కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత.8639442397.**

## జ్యుయెలరీ ఫ్యాక్టరీలో విష వాయువులు లీక్.. నలుగురు కార్మికులు దుర్మరణం..!

గుజరాత్ లోని ప్రముఖ ఇండస్ట్రియల్ సిటీ సూరత్ లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఓ జ్యుయెలరీ పరిశ్రమలో విషవాయువులు లీక్ అయ్యి ఒక సూపర్‌వైజర్ సహా నలుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. అశ్విని కుమార్ రోడ్డులోని జ్యుయెలరీ పరిశ్రమలో జ్యుయెలరీ తయారీ ప్రక్రియలో వెలువడే రసాయన వ్యర్థాలను సేకరించేందుకు ఓ ఈటీపీ సెప్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి 2 నెలలకు ఒకసారి ఈ ట్యాంక్‌ను శుభ్రం చేయాల్సి ఉంటుంది.ఎప్పటిలాగే ఇవాళ ఉదయం ఓ సూపర్‌వైజర్, ముగ్గురు కార్మికులతో కూడిన నలుగురు సభ్యుల బృందం ఆ ట్యాంక్‌ను క్లీన్ చేయడానికి వెళ్లింది. ట్యాంక్ క్లీన్ చేస్తున్న సమయంలో ఓ కార్మికుడు అకస్మాత్తుగా లోపలికి జారిపడిపోయాడు. అతనిని కాపాడే క్రమంలో మిగిలిన ముగ్గురు కూడా ఒకరి వెనుక ఒకరు ట్యాంక్ లోపలికి దిగారు. అయితే ట్యాంక్‌లో అప్పటికే పేరుకుపోయిన రసాయనాల వల్ల తీవ్రమైన విషవాయువులు వెలువడటంతో.. ఊపిరాడక నలుగురు అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయి ప్రాణాలు విడిచారు. సీసీటీవీ ఫుటేజీల పరిశీలించిన అనంతరం.. కార్మికులు సేఫ్టీ మాస్క్‌లు ధరించలేదని స్పష్టమైందని పోలీసులు తెలిపారు. రసాయన వ్యర్థాల వల్ల ఏర్పడిన పాయిజనస్ గ్యాస్ కారణంగానే వారు మరణించినట్లుగా భావిస్తున్నామని అన్నారు. పూర్తి వివరాలు పోస్ట్‌మార్టం నివేదిక వచ్చాకే తెలుస్తాయని పేర్కొన్నారు. ట్యాంక్ లోపలికి దిగే ముందు సూపర్‌వైజర్ అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసినప్పటికీ వారు వచ్చేలోపే వీరు లోపలికి దిగడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ట్యాంక్ నుంచి నలుగురి మృతదేహాలను వెలికితీసి ఆసుపత్రికి తరలించారు.

## ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకూడదని.. మెట్రోల ప్రయాణించిన డీకే శివకుమార్



కర్ణాటక ముఖ్యమంత్రి గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత డీకే శివకుమార్ తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కనకపుర లో పర్యటించారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు , ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విధాన సౌధ మెట్రోస్టేషన్ నుంచి కనకపుర మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు.
ఏ విధమైన హంగూ ఆర్భాటాలు లేకుండా ఒక సామాన్యుడిలా మెట్రో ఎక్కిన ముఖ్యమంత్రిని చూసి తోటి ప్రయాణికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ప్రయాణంలో భాగంగా ఆయన రైల్లోని ప్రయాణికులతో చాలా సాదాసీదాగా, సరదాగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెట్రో ప్రయాణం ముగిసిన తర్వాత కనకపుర స్టేషన్ వద్ద దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముందుకు సాగారు. వినూత్నంగా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెట్రోను ఎంచుకున్న సీఎం డీకే శివకుమార్‌పై బెంగళూరు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



# సేఫ్టీ బెల్ట్ లేకుండా 80 కిలోల బరువు..

## 40 రోజులు నరకం చూశానన్న రకుల్ ప్రీత్ సింగ్!

ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న ఒక తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా వెల్లడించింది. జిమ్‌లో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా వర్కవుట్ చేయడం వల్లే తాను పెద్ద ప్రమాదంలో పడ్డానని ఆమె తెలిపారు. ఇటీవల నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న 'డబుల్ డేట్' టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో ఎలాంటి సేఫ్టీ బెల్ట్ ధరించకుండా 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎత్తడానికి ప్రయత్నించానని, ఆ చిన్న పొరపాటు వల్ల తనకు తీవ్రమైన స్లిప్ డిస్క్ సమస్య వచ్చిందని చెప్పారు. ఆ గాయం కారణంగా తాను ఏకంగా 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామమని, అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమేనని రకుల్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ ప్రమాదం వల్ల కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని వివరించారు. ఎప్పుడూ ఎంతో చురుకుగా ఉండే తాను, కనీసం రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని పేర్కొన్నారు. ఈ గాయం తనను శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఎంతో కృంగదీసిందని రకుల్ కన్నీరు పెట్టారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు కొండంత అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె కొనియాడారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను కూడా ఈ షోలో పంచుకున్నారు. ప్రస్తుతం రకుల్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## సమాజంలో జరిగే ప్రతిదానికీ

# సినిమాలే కారణం కాదు

### - అనసూయ ఆసక్తికర వ్యాఖ్యలు



యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియాలో తాజాగా చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. సమాజంలో జరిగే ప్రతి విషయాన్నీ సినిమాలతో ముడిపెట్టడం సరైన విధానం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. సినిమా అనేది ప్రధానంగా ఒక కల్పిత కథ మాత్రమేనని, సమాజాన్ని మార్చడం లేదా ప్రజలకు విలువలు నేర్పించడం పూర్తిగా సినిమాల బాధ్యత కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు అనసూయ తన సోషల్ మీడియా ఖాతాలో సుదీర్ఘ పోస్ట్‌ను పంచుకున్నారు. వ్యక్తులుగా మంచి, చెడులను గుర్తించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనే ఉంటుందని పేర్కొన్న ఆమె, పిల్లలకు విలువలు నేర్పించే బాధ్యత కూడా సినిమాలది కాదని అభిప్రాయపడ్డారు. అయితే కథలు చెప్పే రచయితలు, దర్శకులు, నిర్మాతలు, నటులు తమ సృజనాత్మక బాధ్యతను పూర్తిగా విస్మరించకూడదని అన్నారు. సినిమా ఎంతో శక్తివంతమైన మాధ్యమమని, అది ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయగలదని అనసూయ పేర్కొన్నారు. గతంలో హీరో, విలన్ పాత్రల మధ్య స్పష్టమైన తేడా ఉండేదని, ప్రేక్షకులు ఏది అనుసరించాలో, ఏది అనుసరించకూడదో సులభంగా అర్థం చేసుకునేవారని చెప్పారు. కానీ ప్రస్తుతం కథలు, పాత్రలు మరింత సంక్లిష్టంగా మారడంతో మంచి-చెడు మధ్య ఉన్న గీత కొన్నిసార్లు మసకబారుతోందని అభిప్రాయపడ్డారు. తాను ఇలాంటి అంశాల గురించి మాట్లాడినప్పుడల్లా సెన్సార్‌షిప్ లేదా మోరల్ పోలీసింగ్‌కు మద్దతు ఇవ్వడం కాదని అనసూయ స్పష్టం చేశారు. కథలను సృష్టించే ప్రతి ఒక్కరూ వాటి ప్రభావం గురించి అవగాహన కలిగి ఉండాలని మాత్రమే కోరుకుంటున్నానని తెలిపారు. ఇదే ఆలోచనతో గతంలో ఒక టెలివిజన్ షోను కూడా వదిలేశానని, తన అభిప్రాయాలు ఆ కార్యక్రమం సృజనాత్మకతకు అడ్డుగా మారుతున్నాయని భావించి ఆ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సృజనాత్మక స్వేచ్ఛ ఎంతో అవసరమని, అయితే ఆ స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉండాలనే అవగాహన సమాజంలో పెరగాలని అనసూయ అన్నారు. సినిమాలు సమాజానికి తల్లిదండ్రుల్లా మారాల్సిన అవసరం లేదని, అదే సమయంలో అవి ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోవద్దని పేర్కొన్నారు. సమాజంలో జరిగే ప్రతి చర్యకు సినిమానే కారణమని తాను నమ్మనని చెప్పిన అనసూయ, సోషల్ మీడియాలో ఇలాంటి అంశాలపై చర్చలు జరగడం, కథనాలను ప్రశ్నించడం, విమర్శనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం సానుకూల పరిణామమని అభిప్రాయపడ్డారు. అవసరమైనప్పుడు ప్రశ్నించడం సృజనాత్మకతపై దాడి కాదని, అది అవగాహన పెంచే ప్రక్రియ మాత్రమేనని ఆమె పేర్కొన్నారు.

# వచ్చేస్తోంది బిగ్ బాస్ 10..

## నాగార్జున 'దశావతారం' ప్రోమో వచ్చేసింది!




బుల్లితెరపై అత్యంత ప్రేక్షకాదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' పదో సీజన్‌తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ షో, ఇప్పుడు ఒక మైలురాయి లాంటి పదో సీజన్‌లోకి అడుగుపెడుతోంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ సీజన్‌కు 'దశావతారం' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ స్టార్ మా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ అధికారిక ప్రోమోను విడుదల చేశాయి.

### ఏమిటీ 'దశావతారం' కాన్సెప్ట్?

తాజాగా విడుదలైన ప్రోమోలో హోస్ట్ అక్కినేని నాగార్జున సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపించారు. పదో సీజన్ కావడంతో, ఈ పదేళ్ల ప్రయాణాన్ని గుర్తుచేస్తూ పది రకాల సరికొత్త అవతారాలతో వినోదం, డ్రామా, ట్విస్టులు అంతకుమించి ఉంటాయని నాగార్జున హింట్ ఇచ్చారు. ఈ ప్రోమో ద్వారా షోపై అంచనాలను భారీగా పెంచే ప్రయత్నం చేశారు. ఈ ప్రత్యేకమైన సీజన్ కోసం బిగ్ బాస్ హౌస్‌ను కూడా గతంలో కంటే వినూత్నంగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.

### ప్రేక్షకుల్లో ఎందుకీ సందేహాలు?

ప్రోమో ద్వారా అంచనాలు పెంచడం బాగానే ఉన్నా, గత అనుభవాల దృష్ట్యా కొందరు నెటిజన్లు, ప్రేక్షకులు పెదవి విరుస్తున్నారు. గత సీజన్‌లో 'ఉల్టా-పుల్టా' అంటూ భారీ హైప్ ఇచ్చినా, చివరికి షో రొటీన్ టాస్కులు, గ్రూపిజం, అవే గొడవలతోనే సాగిందనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కూడా 'దశావతారం' అంటూ క్లాస్ ప్రోమో వదిలారు కానీ, షో ప్రారంభమయ్యాక కంటెంట్ నిజంగా కొత్తగా ఉంటుందా లేక ఎప్పటిలాగే నీరసంగా సాగుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అవుతున్న మేకర్స్, కంటెంట్ విషయంలో తేలిపోతున్నారనేది ప్రధాన విమర్శ.

### కంటెస్టెంట్ల వేట షురూ

ప్రస్తుతం బిగ్ బాస్ నిర్వాహకులు పదో సీజన్ కోసం కంటెస్టెంట్ల వేటలో నిమగ్నమయ్యారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, బుల్లితెర నటీనటులు, కొంతమంది వివాదాస్పద సెలబ్రిటీలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

వీలైనంత త్వరగా ఈ సీజన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తంమీద, 'దశావతారం' కాన్సెప్ట్‌తో బిగ్ బాస్ 10పై భారీ అంచనాలే ఉన్నాయి. అయితే, కేవలం ప్రోమోలకే పరిమితం కాకుండా, కంటెంట్‌లో కూడా కొత్తదనం చూపిస్తేనే ఈ ల్యాండ్‌మార్క్ సీజన్ విజయవంతం అవుతుందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు.

# అలాంటి పాత్రలకు మమ్మల్ని ఎందుకు నిందిస్తారు?

### - డింపుల్ హయతి ఆవేదన



టాలీవుడ్ నటి డింపుల్ హయతి సినీ పరిశ్రమలో హీరోయిన్లకు ఇస్తున్న పాత్రలపై, వారిని నిందించే ధోరణిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బలహీనమైన పాత్రలు చేసినందుకు నటీమణులను నిందించడం సరికాదని, అసలు తప్పు అలాంటి పాత్రలే అమ్ముడవుతాయని నమ్మే వ్యవస్థది, దర్శకనిర్మాతలదని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. 'పెద్ది'లో జాన్వీ కపూర్ వంటి స్టార్ హీరోయిన్ కు ఇచ్చిన పాత్రపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో డింపుల్ హయతి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి."ఈ రోజు మనం నటీమణుల పాత్రలు ఎలా రాస్తున్నారు అనే దాని గురించి మాట్లాడుకుంటున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక పాత్ర చేసిన తర్వాత వెంటనే ఆ నటిని నిందించే ధోరణి కనిపిస్తోంది. కానీ, దయచేసి నటిని నిందించకండి. వ్యవస్థను, మేకర్స్‌ను నిందించండి. ఎందుకంటే, ఏది అమ్ముడుపోతుందని వారు నమ్ముతారో, అలాంటి పాత్రలనే సృష్టిస్తారు.మేము నటీనటులుగా, మాకు లభించిన అవకాశాల పరిధిలోనే పనిచేస్తాం. వాటితోనే పెద్ద సినిమాలు చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ఆశిస్తాం. ఒకవేళ పాత్రలు బలంగా లేకపోతే, ఆ బాధ్యత ఆ పాత్రను పోషించిన నటిపై కాకుండా, ఆ కథను రాసిన రచయితలు, తీసిన దర్శకులపైనే ఎక్కువగా ఉంటుంది.దురదృష్టవశాత్తు, మేము పోషించే పాత్రల వల్ల మమ్మల్ని ఒక మూసలో బంధించేస్తున్నారు. మా పూర్తి నటనను ప్రదర్శించే అవకాశం ఇవ్వకుండానే ఒక ఇమేజ్‌ను కట్టబెడుతున్నారు. అదే హీరో సెంట్రిక్ కథల విషయానికొస్తే, వారికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మనం ఏది చూస్తామో దాన్నే నమ్ముతాం. కానీ, సినిమా నిర్మాణం వెనుక ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇది ఒక్కరి చేతిలో ఉండే నిర్ణయం కాదు.అయితే, మనందరం కలిసి ఏకగ్రీవంగా ఒక విషయాన్ని చెప్పగలం. మనం ఇంకా మంచి అనుభవాలకు, మెరుగైన చిత్ర నిర్మాణానికి అర్హులం. దాని కోసం అందరం కలిసి నిలబడాలి"



## భావోద్వేగ ప్రేమకథ

హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న యువతరం సినిమా 'తెల్ల కాగితం'. రమేష్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మలపాటి నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉన్నది.

ప్రచారంలో భాగంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. యువతరం మెచ్చే యూత్‌ఫుల్ ఎమోషనల్ ప్రేమకథగా ఈ సినిమా రాబోతున్నదని ఫస్ట్‌లుక్ చెబుతున్నది. ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, యువతకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: నందు సవిరిగన, కెమెరా: కేవీ గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: అరుణాచల క్రియేషన్స్.

# ది నైట్ ఆఫ్ ది స్టార్స్ మ్యూజిక్ షో

'ది నైట్ ఆఫ్ ది స్టార్స్' పేరుతో ఈ నెల 12న హైదరాబాద్‌లో సంగీత విభావరి జరగనుంది. ఈ వేడుకలో సంగీత దర్శకుడు కల్యాణి మాలిక్, సింగర్స్ గీతా మాధురి, సాకేత్, వినూత్న, కశ్యప్, అదితి, భార్గవి తమ పాటలతో అలరించబోతున్నారు యూట్యూబర్ విజయేంద్ర సింహ ఈ వేడుకను ఆర్గనైజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 23ఏళ్ల తర్వాత కల్యాణి మాలిక్ ఆధ్వర్యంలో మ్యూజిక్‌షోను నిర్వహించడం ఆనందంగా ఉందని, ఇందులో నోస్టాల్జిక్ పాటల్ని ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తామని తెలిపారు.హైదరాబాద్ వార్తలు తన మొదటి సినిమా 'ఐతే' విడుదలైనప్పుడు ఎంత ఆనందంగా ఉన్నానో.. ఈ షో విషయంలో అంతే హ్యాపీగా ఉన్నానని, తప్పకుండా ప్రేక్షకుల్ని అలరించే మ్యూజిక్ షో అవుతుందని కల్యాణి మాలిక్ పేర్కొన్నారు.



# నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన బోయినిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు

**- ప్రిన్సిపాల్ : ఎరువ రఘునాథ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు శ్రీహర్షిత,లాస్య,శృతి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కు ఎంపికైనట్లు పాఠశాల / కళాశాల ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ. 12,000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు మొత్తం రూ. 48,000 స్కాలర్‌షిప్ అందనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను తీర్చిదిద్దిన గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు ఇరప నాగలక్ష్మి, క్లాస్ టీచర్ గూడూరు శ్రీనివాసరావు, కాసు శ్రీనివాస్‌లను ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్, వైస్ ప్రిన్సిపాల్ కటుకం రాజకుమార్‌తో పాటు అధ్యాపక, ఉపాధ్యాయ బృందం అభినందించారు. అలాగే స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో మెట్‌పల్లి కవుల ప్రతిభ



మెట్ పల్లి (ప్రశ్న న్యూస్) రాజమహేంద్రవరంలో శనివారం ప్రారంభమైన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో జగిత్యాల జిల్లా,మెట్‌పల్లి జాతీయ సాహిత్య పరిషత్ సభ్యులు పాల్గొని తమ కవితా ప్రతిభను చాటుకున్నారు. పరిషత్ సభ్యులు పెండెం శివానంద్, సోప్పరి శ్రీనివాస్, తంగళ్లపల్లి నవీన్‌కుమార్‌లు సభల్లో పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రతిబింబించే కవితలను వినిపించారు.ఈ సందర్భంగా వారి కవితా ప్రదర్శనకు నిర్వాహకులు ప్రశంసలు తెలియజేసి సన్మానం చేయడంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు నంబి రాజేంద్ర శర్మ, ప్రధాన కార్యదర్శి మర్రి భాస్కర్, కోశాధికారి గుంటుక అశోక్, ప్రచార కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, పెరంబుదూర్ లింబగిరి స్వామి, బండి సుధాకర్, బాస మంజుల, గుంటుక గంగాధర్, గౌరవ అధ్యక్షులు మట్టెల గంగాధర్, ఉపాధ్యక్షుడు గుర్రాల మాధవ్, ఉపాధ్యక్షురాలు మాడభూషి భూలక్ష్మి తదితరులు అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో సాహిత్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలుగు భాషకు మరింత సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

# తెలంగాణ రన్స్‌లో జాగిర్యాల్ సత్తా..!

**- ప్రతిభను చాటిన సర్పంచ్ దంపతులు...!!**

**- సర్పంచ్ దంపతులు, గ్రామ యువకుడికి గ్రామస్తుల అభినందనలు**




భీంగల్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రన్స్ ఈవెంట్‌లో నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని జాగిర్యాల్ గ్రామానికి చెందిన పలువురు ప్రతిభ కనబరిచి గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు. గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్,ఆయన సతీమణి అనిత (పీడీ) 5 కిలోమీటర్ల పరుగు పోటీని కేవలం 27 నిమిషాల్లో పూర్తి చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.అదేవిధంగా గ్రామానికి చెందిన గడాల మహేష్ 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను 2 గంటల 26 నిమిషాల్లో విజయవంతంగా పూర్తి చేసి తన సత్తా చాటాడు. వీరి ప్రదర్శన ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, యువతను వ్యాయామం, పరుగుల వైపు ప్రోత్సహించడం లక్ష్యంగానే ఇలాంటి రన్నింగ్ ఈవెంట్లలో పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రమం తప్పకుండా పరుగు తీస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.తెలంగాణ రన్స్‌లో విశేష ప్రతిభ కనబరిచిన గడాల ప్రసాద్, అనిత, గడాల మహేష్ లను గ్రామస్తులు, యువకులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై జూన్ 10న సీపీఐ ఆందోళనలు

**- సమసమాజ నిర్మాణమే లక్ష్యం**

**- సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే : చాడ వెంకట్ రెడ్డి**




వేములవాడ (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై భారం మోపుతోందని, దీనికి నిరసనగా ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. వేములవాడలో జరిగిన కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కౌన్సిల్ సభ్యుల మూడు రోజుల రాజకీయ శిక్షణా శిబిరాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ నిర్మాణం, వర్గరహిత సమాజ స్థాపనే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. శిబిరంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంత్‌రావు, చాడ వెంకటరెడ్డి పలు అంశాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, చెన్న విశ్వనాథం, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై పడిన చెట్లు తొలగించి రాకపోకలు పునరుద్ధరించిన రూరల్ పోలీసులు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండల పరిధిలోని నాగయ్యపల్లె-మర్రిపల్లి రహదారిపై ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు తీవ్ర ప్రభావం చూపించాయి. భారీ గాలికి రహదారి పక్కన ఉన్న చెట్లు విరిగి రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటనతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే వేములవాడ రూరల్ ఎస్సై చల్లా వెంకట్రాజం తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై అడ్డంగా పడిన చెట్లను తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టి జేసీబీ సహాయంతో క్లియర్ చేయించారు. ప్రమాదకరంగా ఉన్న కొమ్మలను కూడా తొలగించి రహదారిని సురక్షితంగా మార్చారు.పోలీసుల అప్రమత్తత, వేగవంతమైన చర్యల ఫలితంగా కొద్దిసేపటికే వాహనాల రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వెంటనే స్పందించిన వేములవాడ రూరల్ పోలీసుల సేవలను స్థానికులు అభినందించారు.

# డప్పు దరువుతో అలరించిన సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి..

**పోచమ్మ తల్లి బోనాల్లో భక్తి పారవశ్యం**

**- మర్లపేట లో ఘనంగా పోచమ్మతల్లి బోనాల పండుగ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మర్లపేట గ్రామంలో గ్రామ ఆరాధ్యదైవమైన పోచమ్మతల్లి బోనాల పండుగను ఆదివారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సంక్షేమం, ప్రజల ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి కోసం నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు నెత్తిన బోనాలెత్తుకొని డప్పు చప్పుళ్లు, కోలాటాల నడుమ ఆధ్యాత్మిక శోభాయాత్రగా అమ్మవారి ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయాలను కాపాడుతూ స్వయంగా డప్పు చేతపట్టుకొని ఉత్సాహంగా దరువేయడం గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. సర్పంచ్ డప్పు వాయిస్తూ భక్తులతో కలిసి నృత్యం చేయడంతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. ఆయన ప్రదర్శనకు యువకులు, గ్రామ పెద్దలు హర్షధ్వానాలు చేస్తూ అభినందనలు తెలిపారు.పోచమ్మతల్లి ఆశీస్సులతో గ్రామంలో సుఖశాంతులు, అభివృద్ధి నెలకొనాలని గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన ఈ బోనాల వేడుకలు మర్లపేట గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.

# నేడు సాయి గీత ఆశ్రమంలో ఉచిత ఆస్తమా వైద్య శిబిరం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ కండ్లకోయలో ఉన్న సాయి గీత ఆశ్రమం ఆధ్వర్యంలో మృగశిర పర్వదినాన్ని పురస్కరించుకుని జూన్ 8, 9 తేదీల్లో ఉచిత ఆస్తమా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి శిబిరంలో ఉచిత వైద్య సలహాలు, ఆయుర్వేద మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మృగశిర రోజున ప్రత్యేకంగా అందించే ఆయుర్వేద మందులు శ్వాస సంబంధిత సమస్యల ఉపశమనానికి తోడ్పడతాయని తెలిపారు. ప్రతి ఏడాది మృగశిర సందర్భంగా నిర్వహించే ఈ వైద్య శిబిరానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది రోగులు హాజరై సేవలను పొందుతున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం 1.33 గంటలకు శిబిరం ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు కొనసాగనుండగా, మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక ఆరోగ్య శ్రేయస్సే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 90953 83940, 94912 48247 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# సింగరేణి పరిరక్షణ సదస్సుకు

**రామగుండం చేరుకున్న హరీశ్ రావు.. ఉద్రిక్తత**



రామగుండం (ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా,రామగుండంలో నిర్వహిస్తున్న సింగరేణి పరిరక్షణ సదస్సులో పాల్గొనేందుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు ఆదివారం చేరుకున్నారు. ఈ సందర్భంగా రామగుండంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)లో బొగ్గు నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లారు. అయితే హరీశ్ రావు పర్యటన నేపథ్యంలో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సీహెచ్‌పీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. సింగరేణి పరిరక్షణకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు వచ్చిన తమను అడ్డుకోవడం సరైంది కాదని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎన్ఎఫ్‌బీఎస్ దరఖాస్తులు ఎంపీడీఓ కార్యాలయంలోనే స్వీకరించాలి

**- జిల్లా కలెక్టర్, ఏఓ ఆదేశాలు**

**- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)సిద్దిపేట నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం (ఎన్ఎఫ్‌బీఎస్) దరఖాస్తు ఫారాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలోనే స్వీకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా పరిపాలన అధికారి (ఏఓ) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి తెలిపారు.ఈ విషయమై శనివారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా పరిపాలన అధికారికి వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్ఎఫ్‌బీఎస్ పథకానికి సంబంధించిన దరఖాస్తుల విషయంలో అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళితే ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాలని, ఎంపీడీఓ కార్యాలయానికి వెళితే తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని సూచిస్తూ దరఖాస్తుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని మరణంతో జీవనాధారం కోల్పోయిన కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంను ప్రవేశపెట్టిందని తెలిపారు. 18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహించే వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబానికి ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందన్నారు.అయితే గ్రామీణ స్థాయిలో సరైన అవగాహన లేకపోవడం, అధికారులు ప్రజలకు తగిన సమాచారం అందించకపోవడం వల్ల అర్హులైన అనేక మంది ఈ పథకం ప్రయోజనాలను పొందలేకపోతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఏఓ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి ఎన్ఎఫ్‌బీఎస్ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలోనే స్వీకరించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ యంత్రాంగం గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అర్హులను గుర్తించి ఈ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని దాసరి ఏగొండ స్వామి కోరారు.

# భక్తుల రద్దీ కొండంత.. సౌకర్యాలు బొట్టంత

**- భక్తుల రద్దీకి తగ్గ సౌకర్యాలేవీ లేవు, విష్ణునివాసంలో అవస్థలే అవస్థలు - విష్ణునివాసంలో కూర్చోడానికి కుర్చీలు, చోటు లేక భక్తుల తీవ్ర అవస్థలు**

**- లక్షలాది మంది వస్తున్నా ప్రణాళికల లోపం - టీటీడీపై విమర్శల వెల్లువ**

**తిరుపతి (ప్రశ్న న్యూస్)** కలియుగ వైకుంఠంగా పేరొందిన తిరుపతికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. సెలవు దినాలు, వారాంతాలు, పండుగలు, ప్రత్యేక దర్శనాల సమయంలో ఈ సంఖ్య లక్షల్లోకి చేరుతుంది. భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతున్నా, వారికి కల్పించాల్సిన కనీస సౌకర్యాలు మాత్రం అదే స్థాయిలో ఉండిపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా తిరుపతి రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న విష్ణునివాసంలో భక్తులు పడుతున్న ఇబ్బందులు టీటీడీ ఏర్పాట్లపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.




## నిలబడటమే గగనం.. కూర్చోవడం దేవుడెరుగు

రైలు దిగిన వెంటనే విశ్రాంతి కోసం విష్ణునివాసానికి చేరుకునే భక్తులకు అక్కడ ఎదురయ్యేది నిరాశే. వేచి ఉండేందుకు వచ్చిన వృద్ధులు, మహిళలు, చిన్నారులతో కూడిన కుటుంబాలు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. కూర్చోవడానికి సరిపడా కుర్చీలు లేకపోవడంతో చాలామంది నేలపైనే కూర్చుంటున్నారు. మరికొందరు తమ లగేజీపై కూర్చొని సమయాన్ని గడుపుతున్నారు.

ప్రత్యేకించి దూర ప్రాంతాల నుంచి ప్రయాణించి వచ్చిన భక్తులకు





కొంతసేపు విశ్రాంతి తీసుకోవడం అత్యవసరం. కానీ విష్ణునివాసంలో అందుకు తగిన ఏర్పాట్లు కనిపించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రద్దీ తెలిసినా ముందస్తు చర్యలు శూన్యం

తిరుపతికి ఏ రోజుల్లో ఎంతమంది భక్తులు వస్తారన్న అంచనా అధికారులకు ముందుగానే ఉంటుంది. రైల్వే రిజర్వేషన్లు, ప్రత్యేక దర్శన టికెట్లు, పండుగల క్యాలెండర్ ఆధారంగా రద్దీని అంచనా వేయడం పెద్ద కష్టమేమీ కాదు. అయినప్పటికీ అదనపు కూర్చునే సదుపాయాలు, తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ సౌకర్యాలు కూడా పెరగాల్సి ఉండగా, ప్రస్తుతం ఉన్నవి కూడా సరిపోని పరిస్థితి నెలకొనడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

## ధనిక దేవస్థానానికి ఇది తగినదేనా.?

ప్రపంచంలోనే అత్యంత సంపన్న ఆధ్యాత్మిక సంస్థల్లో ఒకటిగా టీటీడీ పేరు పొందింది. ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో లోపాలు ఉండటం విమర్శలకు దారితీస్తోంది. కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నా, భక్తులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే సౌకర్యాల విషయంలో మాత్రం పురోగతి కనిపించడం లేదని పలువురు అంటున్నారు.

## భక్తుల కష్టాలు వినేవారెవరు.?

విష్ణునివాసంలో కూర్చునే స్థలాల కొరతతో పాటు తాగునీటి సదుపాయాలు, విశ్రాంతి ప్రదేశాలు, పరిశుభ్రత వంటి అంశాలపైనా భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులతో వచ్చిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఎన్నో గంటలు వేచి ఉండాల్సి వస్తున్న నేపథ్యంలో వారి కోసం ప్రత్యేక సౌకర్యాలు అవసరమని కోరుతున్నారు.

## తక్షణమే చర్యలు తీసుకోవాలి: భక్తులు

భక్తుల రద్దీకి అనుగుణంగా విష్ణునివాసంలో అదనపు కుర్చీలు, విశాలమైన వేచి ఉండే హాళ్లు, తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. టీటీడీ చైర్మన్, పాలకవర్గం, ఈవో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి భక్తులు ఎదుర్కొంటున్న అతి తీవ్రమైన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులను దేవుడి అతిథులుగా భావిస్తామని చెప్పే అధికారులు, ముందుగా వారికి కూర్చునే స్థలం కల్పిస్తేనే ఆ మాటలకు అర్థం ఉంటుందని భక్తులు ఘాటుగా వ్యాఖ్యానిస్తున్నారు. కనీస సౌకర్యాలు దేవుడెరుగు కూర్చునే భాగ్యం కూడా కల్పించలేని దుస్థితిలో టీటీడీ పాలన సాగుతోందా.? భక్తుల రద్దీ పెరుగుతున్న వేళ, సౌకర్యాల పెంపుపై టీటీడీ ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

### స్వర్గసీమ వెంచర్ పై ప్రశ్నించినందుకు

# సూరన్న టీవీకి లీగల్ నోటీసులు

**- ప్రజలకు వాస్తవాలు తెలపమని చెప్పడం తప్ప**

**- ఇటీవల రియల్ ఎస్టేట్ పేరుతో చాలా మంది దొంగ వెంచర్లతో ప్రజలను మోసం చేస్తున్నారు - ప్రజా సంక్షేమం కోసం వాళ్లకు కావాల్సిన పత్రాలు చూసుకోవాలని సూచించిన సూరన్న టీవీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) స్వర్గసీమ వెంచర్‌కు సంబంధించిన ప్రకటనలు, ప్రచార సామగ్రి, భూముల వివరాలపై పలు సందేహాలు వ్యక్తం చేస్తూ సూరన్న టీవీలో ప్రత్యేక వీడియో ప్రసారం చేయబడిందని ప్రజలు పెట్టుబడులు పెట్టే ముందు అన్ని అనుమతులు, లేఅవుట్‌లు, రిజిస్ట్రేషన్ పత్రాలు పూర్తిగా పరిశీలించాలని ఆ వీడియోలో సూరన్న సూచించారు. అయితే ఆ వీడియో ప్రసారం అనంతరం, వీడియోను తొలగించాలని కోరుతూ సూరన్న టీవీకి లీగల్ నోటీసులు అందినట్లు సమాచారం. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రశ్నలు అడగడం, ఆధారాలను పరిశీలించడం మీడియా బాధ్యతలో భాగమని సూరన్న టీవీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏదైనా వెంచర్ లేదా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు, భూ హక్కుల పత్రాలు, లేఅవుట్ ఆమోదాలు, ఇతర చట్టపరమైన అంశాలను పరిశీలించడం కొనుగోలుదారుల బాధ్యత అని నిపుణులు చెబుతున్నారు. కేవలం ప్రకటనలను నమ్మి నిర్ణయం తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని సూరన్న ప్రజలకు వివరించారు. లీగల్ నోటీసులు పంపించడం ఒక చట్టబద్ధమైన ప్రక్రియ అయినప్పటికీ, ప్రజా ప్రయోజనాల కోసం ప్రశ్నలు అడిగే మీడియా సంస్థలను భయపెట్టేందుకు వాటిని ఉపయోగించకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. వాస్తవాలు, ఆధారాలు, చట్టపరమైన అంశాలే చివరికి నిజానిజాలను నిర్ణయిస్తాయని వారు అంటున్నారు. "ప్రజల డబ్బు, ప్రజల భవిష్యత్తు" అనే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని సూరన్న టీవీ తన పరిశోధనాత్మక కథనాలను కొనసాగిస్తుందని, లీగల్ నోటీసులు వచ్చినంత మాత్రాన ప్రజా సమస్యలపై గొంతెత్తడం ఆగదని సూరన్న స్పష్టం చేస్తున్నారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

### హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో


# అస్తవ్యస్త పరిస్థితులు




**- పార్కింగ్ సమస్యలతో ప్రజలు, అధికారులు నానా అవస్థలు**

**- పనిచేయని లిఫ్టులు.. అపరిశుభ్రంగా కార్యాలయ భవనం**

**- సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రాష్ట్ర రాజధానిలోని కీలక ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకటైన హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో పరిస్థితులు రోజురోజుకూ దారుణంగా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా ఉండాల్సిన కలెక్టర్ కార్యాలయం ప్రస్తుతం పార్కింగ్ సమస్యలు, అపరిశుభ్ర వాతావరణం, పనిచేయని లిఫ్టులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలయంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ కార్యాలయానికి రోజూ వందలాది మంది ప్రజలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. అయితే వాహనాలను నిలిపేందుకు తగిన పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్ల సంగతి పక్కన పెడితే, ద్విచక్ర వాహనాలు కూడా ఎక్కడ పార్క్ చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. పార్కింగ్ కోసం ఆశించిన స్థలం లేకపోవడం, పార్కింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేస్తుండటంతో కార్యాలయ పరిసరాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. కలెక్టర్ నిర్వహించే సమావేశాలకు హాజరయ్యే ఇతర శాఖల అధికారులు సైతం పార్కింగ్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే శాంతిభద్రతలను పర్యవేక్షించే పోలీసు శాఖ అధికారులు కూడా ఇక్కడ పార్కింగ్ కోసం తంటాలు పడాల్సి వస్తోందని ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. ఒక జిల్లా పరిపాలనా కేంద్ర కార్యాలయంలోనే ఇటువంటి దారుణమైన పరిస్థితులు ఉండటం అధికార యంత్రాంగ వైఫల్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే కార్యాలయ భవనంలోని ప్రాథమిక సౌకర్యాల పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారింది. లిఫ్టులు



తరచూ పనిచేయకపోవడం వల్ల వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్ల మార్గాలు శుభ్రం చేయకపోవడం, భవనంలో పరిశుభ్రత లేకపోవడం వల్ల కార్యాలయ వాతావరణం అధ్వాన్నంగా మారిందని సందర్శకులు వాపోతున్నారు. కొన్ని సంవత్సరాలుగా లిఫ్టులు పనిచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ కలెక్టర్ కార్యాలయమే ఇలా సమస్యలకు నిలయంగా ఉండటం పట్ల ప్రజల నుండి తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది. సిబ్బంది కొరత ఒక కారణమైతే, ఉన్న సిబ్బంది నిర్లక్ష్య వైఖరి మరో ప్రధాన కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడికి వచ్చే ప్రజలను ఒక్కసారి సమస్య తీర్చకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం ఒక సరదాగా ఉందన్న విమర్శలు ఉన్నాయి. కొందరు ఉద్యోగులు సమయానికి కార్యాలయానికి రావడం లేదని, వచ్చినా ప్రజల సమస్యల పరిష్కారంపై సరైన శ్రద్ధ చూపడం లేదని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన దీన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. ప్రజా పాలనకు ప్రతీకగా నిలవాల్సిన హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలోనే ఇలాంటి దారుణ పరిస్థితులు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇది అధికారుల నిర్లక్ష్యమా.? లేక నిధుల వినియోగంలో లోపాల ఫలితమా.? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అత్యంత దారుణ పరిస్థితులపై దృష్టి సారించి, కలెక్టర్ కార్యాలయంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించే కార్యాలయం ముందుగా తన సమస్యలను పరిష్కరించుకుంటేనే కలెక్టర్ పరిపాలనపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588